తెలుగు దినపత్రిక
RNI TG TEL/ 26/A0381

# సిరి

People's Voice వార్త పత్రిక

01-07-2026
బుధవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 143

PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
www.siridaily.com
సిరి
People's Voice వార్తపత్రిక
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
epaper.siridaily.com
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు
స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575



## జూలై 2న రాష్ట్ర మంత్రి మండలి సమావేశం

- మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయంలో భేటీ
- జూలై 1లోపు అజెండా పంపాలని శాఖలకు ఆదేశాలు
- అజెండా లేకపోయినా 'నిల్' నివేదిక తప్పనిసరి
- సమావేశం రోజున అధికారులు ప్రధాన కార్యాలయంలోనే ఉండాలి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ

2

## అసెంబ్లీపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీల గురి

- వచ్చే ఎన్నికలకే ఇప్పట్నుంచే కసరత్తు
- శాసన మండలి నుంచి అసెంబ్లీకి వెళ్లాలని పలువురి లక్ష్యం
- నియోజకవర్గాల్లో పర్యటనలు.. కార్యకర్తలతో మమేకం
- టికెట్ల కోసం ముందస్తు వ్యూహాలతో గులాబీ నేతలు

2






## నేటినుండి నెట్‌వర్క్ మ్యాపింగ్!

- టీజీఎస్పీడీసీఎల్‌లో వినూత్న కార్యక్రమం
- మీటర్ నుండి సబ్‌స్టేషన్ వరకు డిజిటల్ అనుసంధానం
- వినియోగదారులకు పారదర్శక విద్యుత్ సేవలే లక్ష్యం
- సీఎండీ జితేష్ వి పాటిల్ వెల్లడి
- మీటర్ రీడర్లు, ఫీల్డ్ ఇంజినీర్లతో క్షేత్రస్థాయిలో కనెక్షన్ల ధృవీకరణ ప్రక్రియ
- స్మార్ట్ గ్రిడ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతకు బలమైన పునాది

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన సాంకేతిక ఆధారిత సేవలను అందించేందుకు సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. విద్యుత్ పంపిణీ

మిగతా 3వ పేజీలో..

## తెలంగాణలో నిలిచిన రిజిస్ట్రేషన్లు!

- రెండ్రోజులుగా మొరాయిస్తున్న సర్వర్లు
- మూడు నెలల్లో నాలుగోసారి ఎదురైన సాంకేతిక సమస్య
- రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద కొనుగోలుదారుల ఆందోళన
- ప్రభుత్వ ఆదాయానికి కోట్లలో గండి
- సైబర్ హ్యాకర్ల కుట్ర కోణంలో పెరుగుతున్న అనుమానాలు

3




# విద్యుత్ శాఖలో కార్పొరేట్ మానిటరింగ్..!


వెంచర్లు, పరిశ్రమల ప్రైవేటు అంచనాల్లో లంచాల మత్తు వదిలించేలా ఉన్నత స్థాయి తనిఖీలు

- ఇక కాంట్రాక్టు అవినీతికి చెక్..
- లైన్లు, సబ్‌స్టేషన్ల జియో ట్యాగింగ్ పూర్తి..
- దొంగ బిల్లులకు పడనున్న చిల్లు
- విద్యుత్ శాఖలో లోపాలు, నష్టాల నివారణపై యాజమాన్యాల ప్రత్యేక నిఘా
- టీజీఎస్పీడీసీఎల్, టీజీఎన్పీడీసీఎల్ పరిధిలో స్తంభం స్తంభానికి జీపీఎస్ డిజిటలైజేషన్
- నకిలీ ఇంటర్‌పోల్స్, దొంగ బిల్లుల దందాకు శాశ్వత బ్రేక్
- సంస్థను పరుగులెత్తిస్తున్న యువ ఐఏఎస్ అధికారులు వరుణ్ రెడ్డి, జితేష్ వి పాటిల్

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

తెలంగాణ విద్యుత్ శాఖలో దశాబ్దాలుగా వేరూనుకుపోయిన అవినీతి అక్రమాలకు, కాంట్రాక్టుల మాయాజాలానికి అడ్డుకట్ట వేసేందుకు ప్రస్తుత యాజమాన్యం సరికొత్త 'కార్పొరేట్ మానిటరింగ్' వ్యూహాన్ని అమలులోకి తెచ్చింది. కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నప్పటికీ కొన్ని విద్యుత్ వ్యవస్థలలోని లోపాలు, ప్రైవేటు వ్యక్తులతో కొందరు అధికారులు చేతులు కలపడం వల్లే సంస్థ నష్టాల ఊబిలో కూరుకుపోతోందని యాజమాన్యం గుర్తించింది. ఈ నేపథ్యంలో నష్టాలను గణనీయంగా తగ్గించి, క్షేత్రస్థాయి నుండి పారదర్శకతను పెంచేందుకు సరికొత్త డిజిటలైజేషన్ అస్త్రాన్ని ప్రయోగించింది.

మిగతా 2వ పేజీలో..



## సిగాచి కార్మికుల మరణం ప్రభుత్వ వైఫల్యమే

- మృతులకు ఇస్తానన్న కోటి పరిహారం ఇవ్వలేదు
- కార్మికుల కష్టార్జితాన్ని పరిహారంగా చూపిన ఘనత ఈ ప్రభుత్వానిది
- ఇప్పటికైనా వారికి నష్టపరిహారంచెల్లించాలి
- మాజీ మంత్రి హరీష్‌రావు డిమాండ్

**హైదరాబాద్, జూన్ 30 సిరి న్యూస్:**

సరిగ్గా ఏడాది క్రితం అంటే 2025 జూన్ 30 రాష్ట్రపారిశ్రామిక చరిత్రలో ఒక చీకటి రోజు. కూటి కోసం, కూలి కోసం వలస వచ్చి సిగాచి పరిశ్రమలో పనిచేస్తున్న 54 మంది పేద కార్మికులు సజీవదహనమైన దుర్దినం. రేవంత్ రెడ్డి ప్రభుత్వ నియంత్రణ, పర్యవేక్షణ

మిగతా 2వ పేజీలో..



## కాంగ్రెస్ దిల్లీ దర్బార్‌కు ఏటీఎంగా తెలంగాణ



- బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ విమర్శ

**హైదరాబాద్,జూన్ 30 సిరి న్యూస్:**

కాంగ్రెస్ దిల్లీ దర్బార్ కు తెలంగాణను ఏటీఎంగా మార్చారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ విమర్శించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అధ్యక్షతన మల్కాజిగిరిలోని ఔషాపూర్ రాక్ ఎంక్లేవ్‌లో జరిగిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ నేతృత్వంలో బీజేపీ వెంట నడిచేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారు. బీజేపీను గెలిపించిన రాష్ట్రాల్లో ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నాం. దేశంలో 12 ఏళ్లలో చాలా పరివర్తన వచ్చింది. కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి. పశ్చిమబెంగాల్‌లో

మిగతా 3వ పేజీలో..



2

## మంత్రి శ్రీధర్ బాబు టార్గెట్

- ఏఐతో మార్ఫింగ్ వీడియోలు సృష్టించి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం
- మంత్రి దంపతుల పరువుకు భంగం కలిగించే ప్రయత్నమంటూ ఫిర్యాదు
- కాళేశ్వరం అంశంతో తప్పుడు ప్రచారం చేశారన్న ఆరోపణలు
- లాయర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు



## ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై విద్యార్థులకు ఊరట

- హైకోర్టులో విచారణ 6కు వాయిదా

**హైదరాబాద్,జూన్ 30 సిరి న్యూస్:**

ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన పిటిషన్లపై విచారణను హైకోర్టు జులై 6వ

మిగతా 3వ పేజీలో..

## ప్రత్యేక పోలీస్ బలగాలు రాష్ట్ర భద్రతకు బలమైన కవచం

- ఆధునికీకరణ, సాంకేతికతతో మరింత బలోపేతం
- ఖాళీల భర్తీ.. 'ఫ్యూచర్ సిటీ', ఆమనగల్‌లో కొత్త బెటాలియన్లు
- వరద సహాయక చర్యల్లో అంకితభావం.. సిబ్బందిపై డీజీపీ ప్రశంసలు
- సిబ్బంది సంక్షేమమే ముఖ్యం: మానసిక ఒత్తిడికి 'మిత్ర' కౌన్సెలింగ్



**హైదరాబాద్, జూన్ 30 సిరి న్యూస్:**

హైదరాబాద్, జూన్ 30: రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, ఎన్నికల నిర్వహణ, విపత్తు నిర్వహణ, వీఐపీ బందోబస్తు, ప్రత్యేక ఆపరేషన్లలో కీలక భూమిక పోషిస్తున్న తెలంగాణ స్పెషల్ బెటాలియన్లను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మరింత ఆధునికంగా, సాంకేతికంగా బలోపేతం చేయాలని రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ అధికారులకు సూచించారు. జూబ్లీహిల్స్‌లోని తెలంగాణ స్పెషల్ బెటాలియన్ల ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఆయన

మిగతా 3వ పేజీలో..



## ఏరోస్పేస్ రాజధానిగా తెలంగాణ

- హైదరాబాద్ నుంచే ప్రపంచ విమానయాన భవిష్యత్తుకు దిశానిర్దేశం
- 'మేడ్ ఇన్ తెలంగాణ' ప్రపంచ ఆకాశంలో ఎగురుతోంది
- రాష్ట్ర అంతర్జాతీయ ప్రాధాన్యతను పెంచిన ఏరోమార్ట్
- మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 30 సిరి న్యూస్:**

ప్రపంచ ఏరోస్పేస్ పరిశ్రమకు తెలంగాణ కొత్త కేంద్రంగా అవతరిస్తోందని, ఇకపై అత్యాధునిక విమానాలు, యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, రక్షణ వ్యవస్థల తయారీలో హైదరాబాద్ ప్రపంచ పటంలో అగ్రస్థానంలో నిలవబోతోందని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి కెప్టెన్

మిగతా 2వ పేజీలో..



## అసోంలో భారీ ఆపరేషన్

- అక్రమంగా తరలిస్తున్న 37 కిలోల బంగారం స్వాధీనం

2

# సిగాచి కార్మికుల మరణం ప్రభుత్వ వైఫల్యమే

మొదటిపేజీ తరువాయి

వైఫల్యం.. సిగాచి కంపెనీ నిర్లక్ష్యం కారణంగా ప్రాణాలు కోల్పోయిన అమాయక కార్మికులకు నివాళులర్పిస్తున్నానని మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తెలిపారు. ఈ హృదయవిధారక ఘటనతో యావత్ దేశం ఉలిక్కిపడింది కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మనసు మాత్రం కరగలేదన్నారు. దుర్ఘటన జరిగిన రోజు తన జూబ్లీహిల్స్ ప్యాలెస్ లోనే ఉన్నడు.. కానీ 20 కి.మీ దూరంలో ఉన్న సిగాచి పరిశ్రమ వద్దకు మాత్రం రాలేదు.. బాధిత కుటుంబాల కన్నీళ్లు తుడవలేదు.. విమర్శల నేపథ్యంలో తెల్లారి ఘటన వద్దకు వచ్చిన రేవంత్ రెడ్డి మృతదేహాల సాక్షిగా ప్రతి కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇస్తామని రేవంత్ ఘనంగా ప్రకటించారు.. ప్రభుత్వం తరపున ఇచ్చింది కేవలం రూ.లక్ష.. ఇంతకంటే సిగ్గుమాలిన చర్య ఏమైనా ఉంటదా.. తలదించుకోవాలి' అని వ్యాఖ్యానించారు. కంపెనీ ఇచ్చిన డబ్బులు బాధిత కుటుంబాలకు ముట్టజెప్పి కోటి పరిహారం నుంచి తప్పించుకోవాలని చూస్తున్నరని ఆరోపించారు. కార్మికులు చనిపోవడం వల్ల చట్టబద్ధంగా వారికి రావాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ, లైఫ్ ఇన్సూరెన్స్ డబ్బులను కూడా కలుపుకుని పరిహారంలో చూపడం శోచనీయమన్నారు. అవేదో కంపెనీ జేబులోంచి ఇస్తున్న పరిహారం కాదు.. కార్మికులు కష్టార్జితం నుంచి హక్కుగా వచ్చిన డబ్బు.. ఆ డబ్బులను కూడా కంపెనీ ఇచ్చే పరిహారంలో కలిపి చూపించడం ఈ కాంగ్రెస్ ప్రభుత్వం, యాజమాన్య అమానవీయతకు, దిగజారుడుతనానికి పరాకాష్ట అని విమర్శించారు. చికిత్స పొందుతూ చనిపోయిన కార్మికుల వైద్య ఖర్చులను కూడా ఈ అరకొర పరిహారంలోనే కోత విధించారన్నారు. క్షతగాత్రులకు సరైన వైద్య సహాయం అందక, జీతాలు రాక అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బాధిత కుటుంబాలకు ఇస్తానన్న ఉద్యోగాలు ఇప్పటికీ దిక్కులేదు. కార్మిక శాఖ బాధ్యత రాహిత్యానికి అమాయక వలస బతుకులు వేదన చెందుతున్నాయి. ప్రమాదంలో కాలి బూడిదై ఆచూకీ దొరకని 8 మంది కార్మికుల కుటుంబాలను డెత్ సర్టిఫికెట్ల కోసం నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిప్పించుకున్న దుర్మార్గ ప్రభుత్వం ఇది. ఇది కేవలం ఒక ప్రమాదం కాదు, యాజమాన్యం నిర్లక్ష్యంతో జరిగిన సామూహిక హత్య అన్నారు. ఫ్యాక్టరీలో భద్రతా ప్రమాణాలు గాలికొదిలేశారని విచారణలో స్పష్టంగా తేలింది. 818 హెచ్‌పీ సామర్థ్యానికి మాత్రమే అనుమతి తీసుకుని అక్రమంగా 1777 హెచ్‌పీకి యంత్రాలను పెంచేశారు. సేఫ్టీ గార్డ్స్ లేవు, ఫైర్ ఎన్ఓసీ లేదు, డస్ట్ కంట్రోల్ సిస్టమ్ పనిచేయలేదు. ఇంత నిర్లక్ష్యం బయటపడినా, ప్రభుత్వం యాజమాన్యంపై చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమైందన్నారు. బాధితుల పక్షాన హైకోర్టులో కేసు వేసి న్యాయస్థానం మొట్టికాయలు వేస్తే తప్ప పోలీసులు కదలలేదు. తూతూ మంత్రంగా ఎండీని అరెస్టు చేయడం, వెంటనే ఆయన బెయిల్ మీద బయటకు వచ్చేలా పరోక్షంగా సహకరించడం చూస్తుంటే ప్రభుత్వానికి, కంపెనీ యాజమాన్యానికి మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందాలు ఏమిటో అర్థం అవుతూనే ఉందన్నారు. ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వందల కోట్ల టర్నోవర్ ఉన్న సిగాచి కంపెనీ డైరెక్టర్ల ఆస్తులను రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద అటాచ్ చేయాలి. వాటిని అమ్మి అయినా బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు బేషరతుగా రూ.కోటి పరిహారాన్ని తక్షణమే చెల్లించాలి. ఆనాడు మృతదేహాల సాక్షిగా ఇచ్చిన మాట ప్రకారం పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులతో సంబంధం లేకుండా ప్రతి బాధిత కుటుంబానికి రూ.కోటి పరిహారం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

### ఇతర రాష్ట్రాల వేద పండితులను నియమించడం బాధాకరం

రాష్ట్రంలో ఎంతోమంది వేద పండితులు ఉండగా వారికి దక్కాల్సిన అవకాశాలు ఇతర రాష్ట్రాలకు ఇవ్వడం పట్ల హరీష్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. వేద పండితుల నియామకాల్లో, సెలెక్షన్ కమిటీల్లో స్థానిక వేద పండితులకే అవకాశాలు ఇవ్వాలన్నారు. యాదాద్రి, బాసర, భద్రాచలం తదితర ప్రముఖ దేవాలయాల్లో జరుగుతున్న వేద పండితుల నియామకాల్లో స్థానికులకు జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తూ తెలంగాణ వేద పండితుల ప్రతినిధులు హరీశ్ రావు, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో వేద పండితులను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వేధించడం బాధాకరమని అన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా రాష్ట్రంలోని దేవాలయాల్లో స్థానిక వేద పండితులకు దక్కాల్సిన అవకాశాలు ఇతర రాష్ట్రాలకు చెందిన వారికి వెళ్తున్నాయన్న ఆరోపణలు అత్యంత ఆందోళనకరమన్నారు. తెలంగాణ యువత, స్థానిక వేద పండితుల హక్కులను పరిరక్షించడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. దేవాలయాల్లో భర్తీ చేసే వేద పండితుల పోస్టుల్లో స్థానికులకు ప్రాధాన్యం కల్పించాలని, స్థానిక రిజర్వేషన్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నియామక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, ఇంటర్వ్యూ బోర్డుల్లో కూడా రాష్ట్రానికి చెందిన అర్హులైన వేద పండితులకే అవకాశం కల్పించాలని కోరారు. రాష్ట్ర ఆవిర్భావం వెనుక స్థానికుల హక్కుల పరిరక్షణే ప్రధాన లక్ష్యమని, అలాంటి రాష్ట్రంలో స్థానిక వేద పండితులకు అన్యాయం జరిగే పరిస్థితి ఉండకూడదని హరీశ్ రావు అన్నారు. రాష్ట్రంలో అర్హులైన వేద పండితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని నియామక ప్రక్రియను సమీక్షించి స్థానికులకు ప్రాధాన్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.



# అసెంబ్లీపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీల గురి

**హైదరాబాద్, జూన్ 30 సిరి న్యూస్:**

తెలంగాణలో సాధారణ ఎన్నికలకు ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉన్నప్పటికీ బీఆర్ఎస్‌లో ఎన్నికల సందడి ఇప్పటినుంచే కనిపిస్తోంది. ముఖ్యంగా శాసన మండలి సభ్యులుగా ఉన్న పలువురు నేతలు వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ బరిలో నిలవాలనే లక్ష్యంతో తమ రాజకీయ కార్యకలాపాలను వేగవంతం చేస్తున్నారు. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో పర్యటిస్తూ కార్యకర్తలతో మమేకమవుతున్నట్లు పార్టీలో చర్చ సాగుతోంది.

**నియోజకవర్గాల్లో చురుకైన పర్యటనలు**

పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్సీలు తాము పోటీ చేయాలనుకుంటున్న నియోజకవర్గాలను ఇప్పటికే గుర్తించి అక్కడ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నట్లు సమాచారం. స్థానిక నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించడం, ప్రజల సమస్యలను తెలుసుకోవడం, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా రాజకీయంగా పట్టు సాధించే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ చేపడుతున్న కార్యక్రమాల నిర్వహణలో కూడా కొందరు ఎమ్మెల్సీలు నియోజకవర్గ ఇంచార్జిల కంటే ఎక్కువ చొరవ చూపుతున్నారనే చర్చ సాగుతోంది.

**పోటీకి సిద్ధమవుతున్న నేతలు**

రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు శేరిలింగంపల్లి నుంచి పోటీ చేయాలని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి షాద్‌నగర్‌పై దృష్టి పెట్టినట్లు సమాచారం. ఖమ్మం జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ తాతా మధు పాలేరు నుంచి పోటీ చేయాలనే ఆలోచనలో ఉన్నారని, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు పాలకుర్తి టికెట్‌పై ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. నల్గొండ జిల్లా ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి నాగార్జునసాగర్ టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారని, శాసన మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి మరోసారి భూపాలపల్లి నుంచి పోటీ చేయాలని భావిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది.

వీరితో పాటు మరికొందరు ఎమ్మెల్సీలు కూడా స్థానికంగా రాజకీయ కార్యక్రమాలు నిర్వహిస్తూ తమ అభ్యర్థిత్వాన్ని పరోక్షంగా చాటుకునే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. అయితే ప్రస్తుతం ఎవరికీ ముందస్తుగా టికెట్ హామీ ఇవ్వబోమని, ప్రతి నాయకుడు క్షేత్రస్థాయిలో పనిచేయాల్సిందేనని పార్టీ అధిష్టానం స్పష్టం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయానికి నిర్వహించే సర్వేల ఆధారంగానే అభ్యర్థుల ఎంపికపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

# 30 నెలల్లో రూ.30 వేల కోట్ల రైతుభరోసా ఎగవేత

**హైదరాబాద్, జూన్ 30 సిరి న్యూస్:**

కాంగ్రెస్ ముప్పై నెలల పాలనలో రూ.30 వేల కోట్ల రైతుభరోసా ఎగ్గొటారని, పైగా సభల పేరుతో నాటకాలు ఆడుతున్నారనిబీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టార్గెట్‌గా మరోసారి విమర్శలు గుప్పించారు. హైదరాబాద్ శిల్పకళా పైనుంచి సీఎం రేవంత్ రైతు భరోసా నిధులను మంగళవారం విడుదల చేయనున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వంపై 'ఎక్స్' వేదికగా కేటీఆర్ విరుచుకుపడ్డారు. 30 నెలల ముదనష్టపు పాలనలో దాదాపు రూ.30 వేల కోట్ల రైతు భరోసా ఎగ్గొట్టడమేకాక మళ్లీ సభల పేరిట నాటకాలు ఆడటానికి ఏమాత్రం సిగ్గనిపిస్తలేదా రేవంత్‌రెడ్డీ అని ప్రశ్నించారు. గత రెండున్నరేళ్లలో ఎగ్గొట్టిందే ఎక్కువ అని 70 లక్షల మంది రైతులు శాపనార్థాలు పెడుతుంటే ఆశీర్వాద సభల పేరిట డ్రామాలా? కేవలం ఒక్క బటన్ నొక్కి వేయాల్సిన రైతుభరోసాకు కూడా బహిరంగ సభ పెట్టే నీ పీఆర్ స్టంట్లు చూసి రైతులు అసహ్యించుకుంటున్నారన్నారు. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా నాలుగుసార్లు రైతుభరోసా ఎగ్గొట్టిన ద్రోహాన్ని రైతులు మరిచిపోతారని అనుకోవడం అవివేకమేనంటూ ఎకరానికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తానని గ్యారెంటీల గారడీ చేసి చివరికి ఉన్నది ఊడగొట్టే దుస్థితి తెచ్చినందుకు ముందు ముక్కు నేలకు రాయాలని హితవు పలికారు. అరకొరగా ఒకటి, రెండు ఎకరాలకు వేసినట్టు చేసి చేతులు దులుపుకుంటున్న పాపం మిమ్మల్ని నిరంతరం శాపంలా వెంటాడటం ఖాయమన్నారు. 'ఇప్పటికే రూ.50 వేల కోట్లతో చేయాల్సిన రూ.2 లక్షల రుణ మాఫీని చారాణా కూడా చేయకుండా అధికారంలోకి రాగానే అన్నదాత గొంతుకోశావు.. 72 సార్లు నీ ఢిల్లీ టూర్లకు, పనికిరాని ఈ పబ్లిక్ మీటింగ్‌లకు పెడుతున్న రూ.కోట్ల ఖర్చును ఆదా చేసి ఉంటే రైతులకు పెట్టుబడి సాయం దక్కేది' అని వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా యూరియా దొరకక అల్లాడుతున్న అన్నదాతల కష్టాల నుంచి అటెన్షన్ డైవర్షన్ చేసే ఈ దిక్కుమాలిన చర్యలు ఏమాత్రం పనిచేయవని గుర్తుపెట్టుకోవాలన్నారు. కేంద్రం ఎంత కొంటే అంతే కొంటామని పంట కొనుగోళ్ల బాధ్యత నుంచి పూర్తిగా తప్పుకున్న చేతకానితనాన్ని చూసి అన్నదాతలు పట్టలేని కోపంతో రగిలిపోతున్నారని తెలిపారు. కేసీఆర్ ఠంచన్‌గా 11 సార్లు, రూ.73 వేల కోట్లను నేరుగా రైతుల ఖాతాలో వేసి రాష్ట్రంలో వ్యవసాయ విప్లవానికి నాంది పలికారని గుర్తు చేశారు. పదేళ్లు పండగలా సాగిన వ్యవసాయాన్ని దండగలా మార్చి తమకు వెన్నుపోటు పొడుస్తున్న దుర్మార్గాన్ని అన్నదాతలు ఎన్నటికీ క్షమించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. రాష్ట్ర చరిత్రలో రైతు బాంధవుడిగా కేసీఆర్ నిలిస్తే మీరు ఎప్పటికీ రైతు ద్రోహిగానే మిగిలి ఉంటారని గుర్తుపెట్టుకోండి అంటూ కేటీఆర్ విమర్శించారు.

# మంత్రి శ్రీధర్ బాబు టార్గెట్

**హైదరాబాద్, జూన్ 30 సిరి న్యూస్:**



తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును లక్ష్యంగా చేసుకుని కృత్రిమ మేధ సాంకేతికతతో రూపొందించిన మార్ఫింగ్ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కావడం కలకలం రేపుతోంది. మంత్రి శ్రీధర్ బాబు, ఆయన సతీమణి, సీనియర్ ఐఏఎస్ అధికారి శైలజా రామయ్యర్‌కు సంబంధించిన నకిలీ వీడియోలను ప్రచారం చేస్తూ వారి ప్రతిష్ఠకు భంగం కలిగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై మంత్రి తరఫు న్యాయవాది ఫిర్యాదు చేయడంతో సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**ఏఐతో దుష్ప్రచారం**

మంత్రి దంపతులను లక్ష్యంగా చేసుకుని ఏఐ సాంకేతికతతో నకిలీ వీడియోలను రూపొందించి ఫేస్‌బుక్‌తో పాటు ఇతర సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్నారని న్యాయవాది శశిభూషణ్ కాశే తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉన్నత పదవుల్లో ఉన్న వ్యక్తుల పరువును దెబ్బతీయాలనే ఉద్దేశంతో ఈ వీడియోలను ప్రచారం చేస్తున్నారని, ఇందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

**కాళేశ్వరం అంశంతో ప్రచారం**

ప్రతిష్ఠాత్మక కాళేశ్వరం ప్రాజెక్టు నిధుల వ్యవహారంతో ముడిపెట్టి మంత్రి శ్రీధర్ బాబును తప్పుడు రీతిలో చూపిస్తూ మార్ఫింగ్ వీడియోలను సృష్టించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బీఆర్ఎస్ మంథని పేరుతో ఉన్న ఫేస్‌బుక్ పేజీతో పాటు మరికొన్ని సామాజిక మాధ్యమ ఖాతాల ద్వారా ఈ వీడియోలను ప్రచారం చేస్తున్నట్లు ఆరోపించారు. దీనికి సంబంధించిన ఆధారాలను కూడా పోలీసులకు సమర్పించినట్లు తెలిపారు.

న్యాయవాది ఫిర్యాదు ఆధారంగా సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నకిలీ వీడియోలను రూపొందించి ప్రచారం చేసిన వ్యక్తులను గుర్తించడంతో పాటు వాటి వెనుక ఉన్న ముఠాపై విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం.

# విద్యుత్ శాఖలో 'కార్పొరేట్' మానిటరింగ్..!

మొదటిపేజీ తరువాయి

ఆస్తుల జియో ట్యాగింగ్ పూర్తి.. దొంగ బిల్లులకు చెక్ కొత్త డిస్కమ్ ఏర్పాటు ప్రక్రియలో భాగంగా ఏడాది క్రితమే ప్రారంభమైన విద్యుత్ ఆస్తుల డిజిటలైజేషన్ సర్వే ఇప్పుడు విజయవంతంగా పూర్తయింది. టీజీఎస్పీడీసీఎల్, టీజీఎన్పీడీసీఎల్ పరిధిలోని అన్ని సర్కిళ్లలో గల 11 కేవీ, 33 కేవీ లైన్లతో పాటు సబ్‌స్టేషన్ల ప్రస్తుత పరిస్థితిని జీపీఎస్ ద్వారా నిక్షిప్తం చేశారు. ప్రతి స్తంభం యొక్క లొకేషన్‌ను జియో ట్యాగింగ్ చేయడంతో విద్యుత్ ఆస్తుల పూర్తి సమాచారం ఇప్పుడు కార్పొరేట్ కార్యాలయంలో అందుబాటులో ఉంది. ఇదివరకు ప్రతి సంవత్సరం ఈదురుగాలులు, అకాల వర్షాల పేరుతో వందలాది స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు కూలిపోయినట్లు రికార్డులు సృష్టించి, ఉన్న లైన్ల కంటే రెట్టింపు ఇంటర్‌పోల్స్ వేసినట్లు చూపించి కాంట్రాక్టర్లు, కొందరు అధికారులు కలిసి బిల్లులు నొక్కేసేవారు. ఇకపై అంచనాల మంజూరీ సమయంలోనే వాస్తవ పరిస్థితులను ఆన్‌లైన్‌లో క్రాస్ చెక్ చేయనుండటంతో దొంగ బిల్లుల దందాకు పూర్తిగా చిల్లు పడనుంది.

**మెటీరియల్ స్టోర్లపై కార్పొరేట్ నిఘా**

విద్యుత్ శాఖలో కాంట్రాక్టు పనులు కేవలం లేబర్ చార్జీలకే ఇస్తుండగా, 90 శాతం మెటీరియల్ సప్లై శాఖ ఆధ్వర్యంలోనే జరుగుతుంది. అందుకే స్టోర్ అధికారుల పోస్టింగులకు భారీ డిమాండ్ ఉండేది. దీన్ని అదనుగా చేసుకుని గత 5 ఏళ్ల కాలంలో మహబూబ్‌నగర్, సంగారెడ్డి, నల్గొండ స్టోర్ల నుండి కాపర్ వైర్లు, కేబుల్స్, ఇతర సామాగ్రిని నేరుగా ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకున్న ఉదంతాలు వెలుగుచూశాయి. కొలతల్లో తేడాలు చూపిస్తూ, స్క్రాప్ అమ్మకాల్లో భారీగా లబ్ధి పొందుతున్న అధికారుల తీరుపై యాజమాన్యం ఇప్పుడు డేగకన్ను వేసింది. ఇప్పటికే సంగారెడ్డి, మహబూబ్‌నగర్ల స్టోర్‌లను స్వయంగా సీఎండీ సందర్శించి అక్కడి అక్రమాలను పసిగట్టారు. కాంట్రాక్టర్లను ఇబ్బంది పెట్టకుండా స్టోర్లలో పూర్తి మెటీరియల్ అందుబాటులో ఉంచుతూనే, అక్కడ జరిగే ప్రతి కదలిక నిత్యం కార్పొరేట్ కార్యాలయానికి చేరేలా నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశారు.

**ప్రైవేటు అంచనాలపై డేగకన్ను..**

హైదరాబాద్‌తో పాటు కీలక పట్టణాల శివార్లు వేగంగా విస్తరిస్తుండటంతో కొత్త వెంచర్లు, పరిశ్రమలకు ఇచ్చే కనెక్షన్ల అంచనాలలో కొందరు అధికారులు యజమానులకు అక్రమ లబ్ధి చేకూరుస్తూ సంస్థకు కోట్ల రూపాయల నష్టం వాటిల్లజేస్తున్నారు. నిబంధనలు అతిక్రమించి అంచనాలు వేయడం, తిరస్కరించిన ఫైళ్లకు మళ్లీ దొడ్డిదారిన అనుమతులు ఇవ్వడం వంటి రహస్యాలను యాజమాన్యం గుర్తించింది. ఇకపై కమర్షియల్ కనెక్షన్ల అంచనాలు వేసిన వెంటనే కార్పొరేట్ చెకింగ్ విధిగా జరుగుతుందని, నిబంధనల ప్రకారం ఉంటేనే మంజూరీ లభిస్తుందని స్పష్టం చేశారు. వ్యక్తిగత లాభం కోసం సంస్థకు నష్టం చేసే ఉద్యోగులపై అత్యంత కఠినమైన క్రమశిక్షణా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

**ఇద్దరు సీఎండీలు ఇద్దరే..**

తెలంగాణ విద్యుత్ శాఖలో ప్రస్తుతం సీఎండీలుగా బాధ్యతలు నిర్వహిస్తున్న యువ ఐఏఎస్ అధికారులు ఇద్దరూ సంస్థను ప్రక్షాళన చేయడంలో తమదైన శైలిలో దూసుకుపోతున్నారు. టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు, లోవోల్టేజ్ సమస్య పరిష్కారానికి సబ్‌స్టేషన్లలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఇక టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి పాటిల్ అయితే ఏసీ రూములకే పరిమితం కాకుండా నిత్యం క్షేత్రస్థాయిలోనే పర్యటిస్తున్నారు. సీఎండీ స్థాయి అధికారి నేరుగా స్పాట్ తనిఖీలు చేస్తుండటంతో అనవసర ఖర్చులు తగ్గి, ఆదాయ వనరులు పెరుగుతున్నాయి. ఈ ఇద్దరు యువ అధికారుల నిబద్ధత పట్ల సాధారణ ఉద్యోగులు, వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తుండగా, అవినీతి అక్రమార్కులకు మాత్రం ఈ నయా పాలన పెద్ద సంకటంగా మారింది.

# జూలై 2న రాష్ట్ర మంత్రిమండలి సమావేశం

**హైదరాబాద్, జూన్ 30:**

తెలంగాణ రాష్ట్ర మంత్రిమండలి సమావేశం జూలై 2న నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఆరో అంతస్తులోని మంత్రిమండలి సమావేశ మందిరంలో సమావేశం జరగనుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు.

**అజెండా సమయానికి పంపాలి**

మంత్రిమండలి సమావేశంలో చర్చించాల్సిన అంశాలకు సంబంధించిన అజెండాను తెలుగు అనువాదంతో సిద్ధం చేసి, సర్క్యులేషన్ ద్వారా ఆమోదం పొందిన అనంతరం జూలై 1 మధ్యాహ్నం ఒంటి గంటలోపు సాధారణ పరిపాలన శాఖ మంత్రిమండలి విభాగానికి పంపాలని అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

**అధికారులకు ప్రత్యేక సూచనలు**

ఏదైనా శాఖకు అజెండా అంశాలు లేకపోయినా 'నిల్' నివేదికను నిర్ణీత గడువులోగా పంపాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అలాగే మంత్రిమండలి సమావేశం జరిగే సమయంలో అన్ని శాఖల అధికారులు ప్రధాన కార్యాలయంలో అందుబాటులో ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వానికి సంబంధించిన కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

# అసోంలో భారీ ఆపరేషన్

**గౌహతి,జూన్ 30 సిరి న్యూస్ :**

అస్సాం పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. అర్ధరాత్రి అక్రమంగా తరలిస్తున్న 37 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ దాదాపు రూ.55 కోట్లకు పైనే ఉంటుందని పోలీసులు వెల్లడించారు. బహుశా అస్సాం పోలీస్ చరిత్రలోనే ఇంతపెద్ద మొత్తంలో బంగారం సీజ్ చేసిన ఘటన ఇదే కావొచ్చని డీసీపీ శాంభవి మిశ్రా తెలిపారు. గువాహటిలో అక్షయ్ బన్సోడే (32) అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. బంగారం అక్రమ రవాణాపై నిఘా వర్గాల నుంచి సమాచారం అందడంతో ఈ ఆపరేషన్ చేపట్టాం. 24 క్యారెట్ల బంగారు కడ్డీలతో పాటు దాదాపు 13 గ్రాముల బరువు ఉన్న వెండి ముక్కలు స్వాధీనం చేసుకున్నాం అని ఆమె తెలిపారు. ఈ ముఠాకు అంతర్జాతీయ గోల్డ్ స్మగ్లింగ్ ముఠాతో సంబంధం ఉన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇదొక భారీ అంతర్జాతీయ స్మగ్లింగ్ ముఠాకు సంబంధించినదిగా తెలుస్తోందని పోలీసులు తెలిపారు. బన్సోడే గతంలో మూడుసార్లు 20 కిలోల బంగారాన్ని అక్రమంగా తరలించాడని, తాజాగా నాలుగోసారి తరలిస్తుండగా పట్టుబడినట్లు పేర్కొన్నారు.

# ఏరోస్పేస్ రాజధానిగా తెలంగాణ

మొదటిపేజీ తరువాయి

ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన ఏరోమార్ట్ హైదరాబాద్2026 అంతర్జాతీయ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ బిజినెస్ కన్వెన్షన్ ప్రారంభోత్సవంలో మంత్రి మాట్లాడుతూ ప్రపంచ ఏరోస్పేస్ రంగం ఇప్పుడు తెలంగాణ వైపు చూస్తోంది.. పెట్టుబడులు, పరిశ్రమలు, అత్యాధునిక సాంకేతికతకు తెలంగాణే కొత్త చిరునామా అని స్పష్టం చేశారు. భారత వైమానిక దళంలో పైలట్‌గా పనిచేసిన అనుభవాన్ని గుర్తు చేసుకుంటూ సూపర్‌సోనిక్ యుద్ధ విమానాలను నడిపిన వ్యక్తిగా ఏరోస్పేస్ రంగంలో నాణ్యత, ఖచ్చితత్వం ఎంత కీలకమో ప్రత్యక్ష అనుభవం ఉందన్నారు. అమెరికా అధ్యక్షుడి హెలికాప్టర్‌కు అవసరమైన క్యాబిన్లు, అపాచీ యుద్ధ హెలికాప్టర్ల నిర్మాణ భాగాలు, ఎఫ్16 యుద్ధ విమానాల రెక్కలు, ప్రపంచ ప్రఖ్యాత ఏరో ఇంజిన్ విడిభాగాలు, ఎంఆర్‌వో వ్యవస్థలు నేడు తెలంగాణలోనే తయారవుతున్నాయని తెలిపారు. మేడ్ ఇన్ తెలంగాణ అనే ముద్ర ఇప్పుడు ప్రపంచ ఆకాశంలో గర్వంగా ఎగురుతోంది అని పేర్కొన్నారు. స్పెయిన్‌కు చెందిన ఐటీపీ ఏరో, కెనడాకు చెందిన ఎఫ్‌టీజీ ఏరోస్పేస్ వంటి అంతర్జాతీయ దిగ్గజాలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం రాష్ట్ర పారిశ్రామిక విశ్వసనీయతకు నిదర్శనమన్నారు. ఫ్రాన్స్, ఇటలీ సహా 25కిపైగా దేశాల కంపెనీలు ఏరోమార్ట్‌లో పాల్గొనడం తెలంగాణ అంతర్జాతీయ ప్రాధాన్యతను మరింత పెంచిందని తెలిపారు. తెలంగాణలో ఇప్పటికే 1,500కుపైగా ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలకు సేవలందిస్తున్న ఎంఎస్ఎంఈలు పనిచేస్తున్నాయని, పరిశ్రమలకు అవసరమైన అత్యాధునిక పారిశ్రామిక పార్కులు, ప్రత్యేక ఆర్థిక మండళ్లు, ప్లగ్అండ్‌ప్లే మౌలిక సదుపాయాలు రాష్ట్రాన్ని దేశంలోనే అత్యంత ఆకర్షణీయ పెట్టుబడి గమ్యస్థానంగా మార్చాయని చెప్పారు. డీఆర్‌డీవో, రక్షణరంగ ప్రభుత్వ సంస్థలు, పరిశోధనా కేంద్రాలు, ప్రైవేట్ పరిశ్రమలు ఒకే నగరంలో ఉండటం హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి పోటీ సామర్థ్యాన్ని కల్పించాయన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా మారుతున్న ఐటీఐలు ప్రపంచస్థాయి ఏరోస్పేస్ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యంతో కూడిన యువతను తీర్చిదిద్దుతున్నాయని తెలిపారు. తెలంగాణ ఏరోస్పేస్, డిఫెన్స్ రంగం కొన్నేళ్లుగా 30 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేయగా గత ఏడాది ఎగుమతులు 103 శాతానికి పెరిగి రాష్ట్రానికి అగ్రగామిగా ఉన్న ఔషధ రంగాన్నే అధిగమించడం రాష్ట్ర పారిశ్రామిక చరిత్రలో ఒక సువర్ణాధ్యాయమని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విమానయాన రంగ విస్తరణకు చారిత్రక నిర్ణయాలు తీసుకుందని వెల్లడించారు. వరంగల్ విమానాశ్రయానికి వచ్చే నెలలో శంకుస్థాపన, ఆదిలాబాద్‌లో పౌరసైనిక అవసరాలకు అనువైన ఎయిర్‌ఫీల్డ్, కొత్తగూడెం విమానాశ్రయానికి త్వరలో ఆమోదం లభించనున్నాయని తెలిపారు. ఈ మూడూ భవిష్యత్తులో విమాన మరమ్మతు, విమాన తయారీ, రక్షణ పరిశ్రమలకు భారీ అవకాశాలను తెరవనున్నాయన్నారు. ప్రపంచ ఏరోస్పేస్ దిగ్గజాలను ఉద్దేశించి మాట్లాడుతూ మీ తదుపరి తయారీ కేంద్రం తెలంగాణ కావాలి.. మీ తదుపరి పెట్టుబడి హైదరాబాద్‌లో ఉండాలి అన్నారు. 'ఏరోమార్ట్ హైదరాబాద్2026 ఒక పారిశ్రామిక సదస్సు మాత్రమే కాదు.. ప్రపంచ ఏరోస్పేస్ పటంలో తెలంగాణ శాశ్వత స్థానాన్ని ఖరారు చేసే చారిత్రక వేదిక' అని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు.

# ప్రత్యేక పోలీస్ బలగాలు రాష్ట్ర భద్రతకు బలమైన కవచం

మొదటిపేజీ తరువాయి

పాల్గొని వివిధ పరిపాలనా, సాంకేతిక, సంక్షేమ అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. సమావేశానికి ముందు డీజీపీ ప్రధాన కార్యాలయంలోని వివిధ విభాగాలు, పరిపాలనా సెక్షన్లు, కమ్యూనికేషన్ వ్యవస్థ, ఆయుధాల నిర్వహణ, సాంకేతిక విభాగాలు, నిర్మాణ పనులు, కార్యాలయ నిర్వహణ, ఇతర మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం అధికారులు సమర్పించిన ప్రజెంటేషన్‌ను పరిశీలించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. బెటాలియన్లలో ఖాళీగా ఉన్న పోస్టులను త్వరితగతిన భర్తీ చేయడం, అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడం, వాహనాల సంఖ్యను పెంచడం, సిబ్బందికి మెరుగైన నివాస క్వార్టర్లు, తాగునీరు, వైద్య సదుపాయాలు, ఇతర సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ (ఏపీఎస్పీ) బెటాలియన్లు నక్సల్స్ ఉద్యమం తీవ్రంగా ఉన్న సమయంలో సివిల్ పోలీసులకు వెన్నుదన్నుగా నిలిచి ఎన్నో కీలక ఆపరేషన్లలో విశేష సేవలు అందించాయని గుర్తు చేశారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రతి పోలీస్ స్టేషన్‌కు ప్రత్యేక బలగాలను అనుసంధానం చేయడం ద్వారా పోలీసు వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేసిందన్నారు. తాను నిజామాబాద్, వరంగల్ వంటి నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో జిల్లాల ఎస్పీగా పనిచేసిన సమయంలో ప్రత్యేక బలగాల సేవలను ప్రత్యక్షంగా చూశానని తెలిపారు. ఆ సమయంలో పోలీస్ స్టేషన్లపై తరచూ నక్సల్స్ దాడులు జరిగేవని, అలాంటి పరిస్థితుల్లో స్పెషల్ పోలీస్ బెటాలియన్లు అత్యంత ధైర్యసాహసాలతో విధులు నిర్వహించి నక్సల్స్ నిర్మూలనలో కీలక పాత్ర పోషించాయని ప్రశంసించారు. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ ప్రభుత్వం 13 స్పెషల్ బెటాలియన్లను ఏర్పాటు చేసి రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా వాటిని అభివృద్ధి చేసిందని తెలిపారు. ప్రస్తుతం ఈ బెటాలియన్లు ఎన్నికల సమయంలో భారీ బందోబస్తు, శాంతిభద్రతల నిర్వహణ, ముఖ్యమైన ఉత్సవాలు, మతపరమైన వేడుకలు, ప్రజాసమావేశాలు, వీఐపీ భద్రత, విపత్తు నిర్వహణ, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజల రక్షణలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నాయని కొనియాడారు. ఇటీవల నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో కురిసిన భారీ వర్షాల సమయంలో తెలంగాణ స్పెషల్ బెటాలియన్ సిబ్బంది వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, సహాయక చర్యల్లో పాల్గొనడం, ప్రాణాలు, ఆస్తులను కాపాడడంలో అంకితభావంతో పనిచేశారని అభినందించారు. బెటాలియన్ల కమాండెంట్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొంటూ, పరిపాలనలో క్రమశిక్షణతో పాటు మానవతా దృక్పథం కూడా ఉండాలని సూచించారు. సిబ్బంది కుటుంబ పరిస్థితులు, ఆరోగ్యం, పిల్లల విద్య, వ్యక్తిగత సమస్యలను తెలుసుకుంటూ వారికి అండగా నిలవాలని చెప్పారు. దూర ప్రాంతాల్లో నెలల తరబడి విధులు నిర్వహించే సిబ్బందికి కుటుంబ సభ్యుల నుంచి దూరంగా ఉండటం వల్ల మానసిక ఒత్తిడి ఏర్పడే అవకాశం ఉంటుందని, అలాంటి పరిస్థితుల్లో అధికారులు వారికి అవసరమైన మానసిక బలం అందించాలని సూచించారు. డ్యూటీల కేటాయింపులో పూర్తి పారదర్శకత పాటించాలని, ఎలాంటి వివక్షకు తావివ్వకుండా అందరికీ సమాన అవకాశాలు కల్పించాలని స్పష్టం చేశారు. ఎన్నికలు, ప్రత్యేక బందోబస్తు, వీఐపీ విధులు, ఇతర ప్రత్యేక డ్యూటీలను కూడా నిష్పాక్షికంగా కేటాయించాలని ఆదేశించారు. ప్రతి బెటాలియన్ పనితీరును క్రమం తప్పకుండా సమీక్షిస్తూ, సమగ్ర రివ్యూ నిర్వహించాలని సూచించారు. భవిష్యత్తులో రాష్ట్ర అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఫ్యూచర్ సిటీ, ఆమనగల్ ప్రాంతాల్లో కొత్త స్పెషల్ బెటాలియన్ల ఏర్పాటు అవకాశాలను కూడా పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. పోలీసు సిబ్బందిలో మానసిక ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలంటూ, 'మిత్ర' కౌన్సెలింగ్ కేంద్రాలను మరింత సమర్థంగా వినియోగించాలని సూచించారు. విధుల ఒత్తిడి, కుటుంబ సమస్యలు, వ్యక్తిగత ఇబ్బందులతో బాధపడుతున్న సిబ్బందిని గుర్తించి వారికి నిపుణుల ద్వారా కౌన్సెలింగ్ అందించాలని ఆదేశించారు. పోలీసు సిబ్బంది డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్, ఇతర వ్యసనాల బారిన పడకుండా అధికారులు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అలాంటి అలవాట్లకు గురైన వారిని శిక్షించడం కంటే ముందుగా గుర్తించి, కౌన్సెలింగ్, వైద్య సహాయం ద్వారా తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. పోలీసు సిబ్బందిలో ఆత్మహత్యల నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, వారి ప్రవర్తనలో వచ్చే మార్పులను అధికారులు, సహచరులు ముందుగానే గుర్తించి తక్షణమే స్పందించాలని సూచించారు. ప్రతి కమాండెంట్ తన పరిధిలోని సిబ్బందితో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ పరిష్కరించే దిశగా పనిచేయాలని చెప్పారు. శిక్షణకు ఎల్లప్పుడూ అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, ఆధునిక పోలీసింగ్‌కు అనుగుణంగా ప్రత్యేక శిక్షణ కేంద్రాలను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, ఆయుధ వినియోగం, విపత్తు నిర్వహణ, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, శారీరక దారుఢ్యం, మానసిక దృఢత్వంపై నిరంతర శిక్షణ అందించాలని సూచించారు. స్పెషల్ బెటాలియన్లు రాష్ట్ర పోలీసు వ్యవస్థకు వెన్నెముక వంటివని పేర్కొన్న డీజీపీ, భవిష్యత్తు సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేలా ఆధునికీకరణ, క్రమశిక్షణ, సాంకేతికత, సిబ్బంది సంక్షేమం అనే నాలుగు ప్రధాన లక్ష్యాలతో ముందుకు సాగాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై విద్యార్థులకు ఊరట

మొదటిపేజీ తరువాయి

తేదీకి వాయిదా వేసింది. ఈ కేసులో గత విచారణ సందర్భంగా జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులు అప్పటివరకు కొనసాగుతాయని న్యాయస్థానం స్పష్టం చేసింది. గత విచారణలో విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ముఖ్యంగా విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయరాదని పేర్కొంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్9లోని నాలుగు నిబంధనల అమలుపై తాత్కాలికంగా స్టే విధించింది. హైకోర్టు జారీ చేసిన ఈ మధ్యంతర ఉత్తర్వులు 6వ తేదీ జరిగే తదుపరి విచారణ వరకు అమల్లో ఉంటాయని న్యాయస్థానం స్పష్టం చేసింది. దీంతో సంబంధిత విద్యాసంస్థలు, విద్యార్థులు, తల్లిదండ్రుల్లో నెలకొన్న అనిశ్చితికి తాత్కాలిక ఉపశమనం లభించినట్లైంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానానికి సంబంధించిన వివిధ అంశాలపై పిటిషనర్లు కోర్టును ఆశ్రయించిన విషయం విదితమే. ఈ క్రమంలో ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోలోని కొన్ని నిబంధనలపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసింది. జులై 6వ తేదీ జరగనున్న తదుపరి విచారణలో ప్రభుత్వం, పిటిషనర్ల వాదనలను పరిశీలించనుంది. అనంతరం హైకోర్టు మరిన్ని ఆదేశాలు జారీ చేసే అవకాశం ఉంది. ఈ కేసు తీర్పు రాష్ట్రంలోని వేలాది మంది విద్యార్థులు, విద్యాసంస్థలపై ప్రభావం చూపే అవకాశముండటంతో ఆసక్తి నెలకొంది.

# కాంగ్రెస్ దిల్లీ దర్బార్‌కు ఏటీఎంగా తెలంగాణ

మొదటిపేజీ తరువాయి

ఎలా గెలిచారని చాలా మంది నన్ను అడుగుతున్నారు. కార్యకర్తల కష్టాలతో పశ్చిమ బెంగాల్‌లో గెలిచామని చెప్పాను. అక్కడ పార్టీ కార్యకర్తలను చాలా ఇబ్బందులకు గురిచేశారు.. అయినా లెక్కచేయకుండా బీజేపీని గెలిపించాలనే ఆలోచనతో వారు పనిచేశారు. అని కొనియాడారు. 'సర్'పై ప్రజలకు బీజేపీ కార్యకర్తలు అవగాహన కల్పించాలన్నారు. తెలంగాణలో 'సర్'పై ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఇక్కడినుంచి దిల్లీకి డబ్బులు వెళ్తున్నాయి.. దిల్లీ దర్బార్‌కు తెలంగాణ ఏటీఎంగా మార్చారు. తెలంగాణలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు ఇచ్చింది.. కానీ ఒక్కటికూడా పూర్తి చేయలేదు. కాంగ్రెస్.. అవినీతి, నేరాల తరహా పాలన చేస్తున్నారు. కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్‌ఎస్ కలిసే ఉన్నాయి. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు ఇంకా అన్యాయం జరుగుతూనే ఉందని నితిన్ నన్నారు.న్ ఆరోపించారు. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు సమావేశంలో పాల్గొన్నారు.

# నేటినుండి నెట్‌వర్క్ మ్యాపింగ్!

మొదటిపేజీ తరువాయి

వ్యవస్థను డిజిటలైజ్ చేస్తూ, అంతరాయాలను క్షణాల్లో గుర్తించేందుకు వీలుగా వినూత్న సమగ్ర విద్యుత్ నెట్‌వర్క్ మ్యాపింగ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నేటి నుండి సంస్థ పరిధివ్యాప్తంగా ఈ డ్రైవ్‌ను ప్రారంభించనున్నట్లు టీజీఎస్పీడీసీఎల్ నూతన సీఎండీ జితేష్ వి. పాటిల్ అధికారికంగా ప్రకటించారు. తొలి దశలో ఈ ప్రాజెక్టును కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలో వేగంగా అమలు చేయనున్నారు.

మీటర్ నుండి సబ్‌స్టేషన్ వరకు.. ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో వినియోగదారుల సర్వీసులకు, సంబంధిత ట్రాన్స్‌ఫార్మర్లు మరియు ఫీడర్ల మధ్య స్పష్టమైన డిజిటల్ అనుసంధాన రికార్డులు లేవు. ఈ లోటును భర్తీ చేస్తూ.. 132/33 కేవీ ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్ల నుంచి మొదలుకొని, 33/11 కేవీ సబ్‌స్టేషన్లు, 11 కేవీ ఫీడర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు మీదుగా ప్రతి వినియోగదారుడి ఇంటి సర్వీస్ కనెక్షన్ వరకు పూర్తి విద్యుత్ నెట్‌వర్క్‌ను డిజిటల్ రూపంలో అనుసంధానించనున్నారు. ఈ మ్యాపింగ్ పూర్తయితే, ఒక వినియోగదారుడి ఇంటికి విద్యుత్ ఏ సబ్‌స్టేషన్ నుండి, ఏ ఫీడర్ ద్వారా సరఫరా అవుతుందనే పూర్తి సమాచారం ఒకే డిజిటల్ క్లౌడ్ వేదికపై స్పష్టంగా దృశ్యమానమవుతుంది.

**క్షేత్రస్థాయిలో ఇంజినీర్లు, మీటర్ రీడర్ల వేట**

ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు విద్యుత్ శాఖ ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసింది. ఇందులో భాగంగా ఫీల్డ్ ఇంజినీర్లు ప్రతి 11 కేవీ ఫీడర్‌కు అనుసంధానమైన డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల 'స్ట్రక్చర్ కోడ్లను' క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించి ధృవీకరిస్తారు. దీనికి తోడు, జూలై నెల బిల్లింగ్ ప్రక్రియలో మీటర్ రీడర్లు ప్రతి డీటీఆర్‌ను విధిగా సందర్శించి, ఆయా ట్రాన్స్‌ఫార్మర్ల పరిధిలోకి వచ్చే వినియోగదారుల సర్వీస్ నంబర్లను ఖచ్చితంగా మ్యాపింగ్ చేస్తారు. ఈ ప్రక్రియ ద్వారా సబ్‌స్టేషన్ □ ఫీడర్ □ డీటీఆర్ □ కనెక్షన్ అనే పూర్తి విద్యుత్ నెట్‌వర్క్ శ్రేణి ఆన్‌లైన్‌లో 100 శాతం ధృవీకరణ కానుంది.

**వినియోగదారుడికి ఫిర్యాదు చేసిన క్షణాల్లోనే పరిష్కారం**

ఈ మ్యాపింగ్ డ్రైవ్ వల్ల సామాన్య వినియోగదారులకు విప్లవాత్మక ప్రయోజనాలు చేకూరనున్నాయి. ఎక్కడైనా విద్యుత్ నిలిచిపోయినప్పుడు వినియోగదారుడు 1912 కాల్ సెంటర్, మొబైల్ యాప్, వాట్సాప్ లేదా వెబ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు నమోదు చేసిన వెంటనే.. సదరు సర్వీస్ ఏ ట్రాన్స్‌ఫార్మర్‌కు లింక్ అయి ఉందో సిస్టమ్ స్వయంచాలకంగా గుర్తిస్తుంది. దీనివల్ల సమస్య ఫీడర్ పరిధిలో ఉందా, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉందా లేక వ్యక్తిగత లైన్ కనెక్షన్ లోపమా అనేది తక్షణమే నిర్ధారణ అవుతుంది. ఫలితంగా ఫీల్డ్ సిబ్బంది ఎక్కడ సమస్య ఉందో వెతుక్కునే సమయం వృథా కాకుండా, నేరుగా స్పాట్‌కు వెళ్లి విద్యుత్‌ను త్వరగా పునరుద్ధరిస్తారు. అలాగే, విద్యుత్ నిలిచిపోవడానికి గల కారణం, సరఫరా ఎప్పటికి వస్తుందనే అంచనా సమయాన్ని వినియోగదారులకు ఎప్పటికప్పుడు ఎస్ఎంఎస్ ద్వారా పారదర్శకంగా పంపే వీలుంటుంది.

**ఏఐ సాంకేతికతకు బలమైన పునాది**

ఈ నెట్‌వర్క్ మ్యాపింగ్‌కు అనుసంధానంగా టీజీఎస్పీడీసీఎల్ ఐటీ విభాగం ఒక అత్యాధునిక డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ను అభివృద్ధి చేస్తోంది. ఈ వ్యవస్థ ద్వారా వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులను రియల్ టైమ్‌లో విశ్లేషించి, బ్రేక్‌డౌన్ ప్రాంతాన్ని ఆటోమేటిక్‌గా గుర్తిస్తారు. ఇది భవిష్యత్తులో విద్యుత్ సంస్థ ప్రవేశపెట్టబోయే స్మార్ట్ గ్రిడ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత అవుటేజ్ మేనేజ్‌మెంట్ మరియు ప్రిడిక్టివ్ మెయింటెనెన్స్ (ముందస్తు లోపాల గుర్తింపు) వంటి వినూత్న సాంకేతికతలకు బలమైన పునాదిగా నిలవనుంది. లోడ్ మేనేజ్‌మెంట్‌ను మెరుగుపరచడం మరియు భవిష్యత్ మౌలిక వసతుల ప్రణాళికలను శాస్త్రీయంగా రూపొందించడానికి ఈ డేటా విద్యుత్ సంస్థకు ఎంతో ఉపయోగపడనుంది.

**వినియోగదారుల సేవల్లో నూతన ప్రమాణాలు: సీఎండీ**

ఈ వినూత్న కార్యక్రమంపై టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ.. విద్యుత్ పంపిణీ వ్యవస్థలో ఆధునిక సాంకేతికతను, డిజిటలైజేషన్‌ను విస్తృతంగా ప్రవేశపెట్టడం ద్వారా వినియోగదారులకు వేగవంతమైన, పారదర్శకమైన మరియు అత్యంత నమ్మకమైన సేవలను అందించడమే మా ప్రధాన లక్ష్యం. ఈ సమగ్ర నెట్‌వర్క్ మ్యాపింగ్ కార్యక్రమం భవిష్యత్ విద్యుత్ రంగానికి గట్టి రోడ్ మ్యాప్ వేయడమే కాకుండా, వినియోగదారుల సేవల్లో సరికొత్త జాతీయ ప్రమాణాలను నెలకొల్పుతుంది అని ఆశాభావం వ్యక్తం చేశారు.

# తెలంగాణలో నిలిచిన రిజిస్ట్రేషన్లు!

తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయి. సాంకేతిక లోపం కారణంగా సర్వర్ మొరాయించడంతో సోమవారం మొదలైన సమస్య, మంగళవారం సాయంత్రం వరకు కొనసాగింది. దీంతో రాష్ట్రంలోని అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

**క్యూ కట్టిన ప్రజలు.. ఆగ్రహంతో వాగ్వాదం**

స్లాట్ బుక్ చేసుకున్న వారితో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు కిక్కిరిసిపోయాయి. ఉదయం నుండి సర్వర్ పనిచేయకపోవడంతో కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నిన్నటి నుంచి సమస్య కొనసాగుతున్నా అధికారులు ఎందుకు పరిష్కరించడం లేదంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు చోట్ల కార్యాలయాల్లో అధికారులతో కొనుగోలుదారులు వాగ్వాదానికి దిగగా, వారిని సముదాయించడానికే అధికారులకు సమయం సరిపోయింది.

**మూడు నెలల్లో నాలుగోసారి!**

రిజిస్ట్రేషన్ విభాగంలో ఇలా సాంకేతిక సమస్య తలెత్తడం గత మూడు నెలల్లో ఇది నాలుగోసారని ఆ శాఖ అధికారులు వెల్లడించారు. ప్రతిసారీ సర్వర్ డౌన్ కావడం, కార్యాలయాల్లో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడటం పరిపాటిగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రాష్ట్ర ఆదాయానికి భారీ నష్టం**

సర్వర్ డౌన్ అవ్వడం వల్ల ప్రభుత్వానికి రావాల్సిన కోట్ల రూపాయల ఆదాయానికి గండి పడుతోంది. ఇప్పటికే వాయిదా పడిన రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరుగుతుండటంతో, సర్వర్ పునరుద్ధరణ తర్వాత కార్యాలయాలపై ఒత్తిడి మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

**హ్యాకర్ల పనా? పెరిగిన అనుమానాలు**

ప్రభుత్వ ఆదాయాన్ని ఇచ్చే శాఖల సర్వర్లు తరచూ డౌన్ అవ్వడం వెనుక ఏదైనా కుట్ర ఉందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవలే రవాణా శాఖ సర్వర్ డౌన్ కావడానికి పాకిస్తానీ టెకీలే కారణమని నిపుణులు తేల్చిన నేపథ్యంలో, ఇప్పుడు రిజిస్ట్రేషన్ శాఖ సర్వర్ విషయంలోనూ అదే తరహా అనుమానాలు తలెత్తుతున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే చర్యల్లో భాగంగానే ఇలా జరుగుతుందా అనే కోణంలో చర్చ జరుగుతోంది. ఏది ఏమైనా, ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా సైబర్ భద్రతా విభాగం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# అబద్ధపు ప్రచారాలను తిప్పికొట్టాలి

హైదరాబాద్, జూన్ 30 సిరి న్యూస్:

"పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించి, అప్పుల ఊబిలోకి నెట్టిన మాజీ పాలకులకు రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు. రాష్ట్రంపై బావ, బామ్మర్దులు (కేటీఆర్, హరీష్ రావు) అడ్డగోలుగా అబద్ధపు కట్టుకథలు అల్లుతూ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని రైతాంగం తిప్పికొట్టాలి" అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. మంగళవారం హైదరాబాద్ శిల్పకళా వేదికలో జరిగిన రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమంలో ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడారు. పది సంవత్సరాల ఆనాటి పాలనలో మంత్రులుగా పనిచేసిన హరీష్‌రావు, కేటీఆర్ ఈరోజు బావ, బామ్మర్దులుగా కలిసి రోజుకో అబద్ధాన్ని సృష్టిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. పదేళ్లు మంత్రిగా పనిచేశాక కూడా బాధ్యతారహితంగా మాట్లాడుతున్న తీరు బాధాకరం" అని ఆయన విమర్శించారు. ప్రభుత్వంపై అడ్డగోలుగా ఆరోపణలు చేయడం మానుకోవాలని ఆయన హితవు పలికారు. గత ప్రభుత్వ హయాంలో రైతుల కోసం జరిగిన ఖర్చుతో పోలిస్తే, తమ ప్రభుత్వం ఎంతో నిబద్ధతతో పనిచేస్తుందని గణాంకాలతో సహా వివరించారు. "గత ప్రభుత్వం పదేళ్లలో రైతుల కోసం కేవలం 2,88,670 కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు చేసింది. అంటే నెలకు సగటున 2,532 కోట్లు, ఏడాదికి 30,364 కోట్లు మాత్రమే వెచ్చించారు. కానీ, మా కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రెండున్నర ఏళ్లలోనే 1,56,496 కోట్ల రూపాయలను రైతుల కోసం ఖర్చు చేసింది. అంటే నెలకు 5,217 కోట్ల చొప్పున, ఏడాదికి 62,604 కోట్ల రూపాయలను రైతు సంక్షేమం కోసం వెచ్చిస్తున్నాం. ఇది గత పాలకులు ఖర్చు చేసిన దానికంటే రెట్టింపు" అని ఆయన స్పష్టం చేశారు.

# కేంద్ర మంత్రి బండికి ఊరట

- **హుజూరాబాద్ ఉప ఎన్నికల కేసు కొట్టివేత**

హైదరాబాద్, జూన్ 30 సిరి న్యూస్:



హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో నమోదైన కేసులో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ఊరట లభించింది. ఈ కేసును విచారించిన నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు బండి సంజయ్‌పై నమోదైన కేసును కొట్టివేసింది. హుజూరాబాద్ ఉప ఎన్నికల సందర్భంగా అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీ ఓటుకు రూ.25 వేల వరకు ఇస్తోందని బండి సంజయ్ ఆరోపించారు. అలాగే ఓటర్లకు రూ.5 వేల చొప్పున ఇచ్చి, మిగిలిన మొత్తాన్ని బీఆర్ఎస్ కార్యకర్తలు పంచుకుంటున్నారని కూడా ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో హుజూరాబాద్ పోలీసులు బండి సంజయ్‌పై ఐపీసీ సెక్షన్లు 188, 171సీ, 505(2)తో పాటు ప్రజాప్రాతినిధ్య చట్టం1951లోని సెక్షన్ 123(3ఏ) కింద కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో కేసును విచారించిన నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు కేసును కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది.



# ఔటర్ రింగ్ రోడ్డుపై కాల్పుల కలకలం

హైదరాబాద్, జూన్ 30 సిరి న్యూస్:

హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై కాల్పుల ఘటన కలకలం రేపింది. ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ నంబర్ 8 సమీపంలో ఈ ఘటన జరిగినట్లు సమాచారం.

ప్రాథమిక సమాచారం ప్రకారం, మోస్ట్ వాంటెడ్ నేరస్థుడిని లక్ష్యంగా చేసుకుని పోలీసులు కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. సదరు నేరస్థుడిపై ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలోనూ పలు కేసులు నమోదై ఉన్నట్లు సమాచారం. అయితే, ఈ ఘటనపై ఇప్పటివరకు పోలీసుల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. కాల్పులకు దారితీసిన పరిస్థితులు, నిందితుడి పరిస్థితి, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. పోలీసుల అధికారిక ప్రకటన వెలువడిన తర్వాతే ఘటనపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# పోక్సో కేసులో హైకోర్టును ఆశ్రయించిన బండి భగీరథ్

- **బెయిల్ పిటిషన్‌పై నేడు విచారణ**

హైదరాబాద్, జూన్ 30 సిరి న్యూస్:



తనపై నమోదైన పోక్సో కేసులో బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ బండి భగీరథ్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు తన న్యాయవాదుల ద్వారా బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. బండి భగీరథ్ దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం న్యాయమూర్తి జస్టిస్ కలసికం సుజన నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టనుంది. ఈ విచారణపై రాజకీయ, న్యాయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. బెయిల్ పిటిషన్‌లో కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని, తాను పూర్తిగా నిర్దోషినని భగీరథ్ పేర్కొన్నారు. తనపై నమోదైన కేసు రాజకీయ ప్రేరేపితమైందని, రాజకీయ ప్రయోజనాల కోసమే తప్పుడు ఆరోపణలు చేశారని వాదించారు. కేసు నమోదైనప్పటి నుంచి దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తున్నానని, పోలీసులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చానని పిటిషన్‌లో వివరించారు. ఈ నేపథ్యంలో తనకు బెయిల్ మంజూరు చేయాలని హైకోర్టును కోరారు.

# 3 వేల కుటుంబాలకు ఊరట..

- **పార్కు స్థలం కాపాడిన హైడ్రా**

హైదరాబాద్, జూన్ 30 సిరి న్యూస్:

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి మండలం బోడుప్పల్ గ్రామ పరిధిలోని టెలిఫోన్ కాలనీలో 1,166 చదరపు గజాల పార్కు స్థలాన్ని హైడ్రా ఆక్రమణల నుంచి రక్షించింది. ఈ చర్యతో కాలనీలో నివసిస్తున్న సుమారు 3 వేల కుటుంబాలు, 10 వేల మందికి పార్కు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంది. 1974లో గ్రామపంచాయతీ లేఅవుట్‌గా టెలిఫోన్ కాలనీ ఏర్పాటైంది. అప్పట్లోనే 1,166 చదరపు గజాల స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. అయితే కాలక్రమంలో ఈ స్థలాన్ని ఆరు భాగాలుగా విభజించి ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నించారు. కాలనీ వాసులు పార్కుగా అభివృద్ధి చేయాలని ప్రయత్నిస్తుండగా, ఆక్రమణదారులు అడ్డంకులు సృష్టిస్తున్నారని నివాసితులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై స్పందించిన హైడ్రా అధికారులు సంబంధిత శాఖలతో కలిసి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. బోడుప్పల్ గ్రామంలోని సర్వే నంబర్లు 78, 79లో ఈ కాలనీ ఉన్నట్లు నిర్ధారించారు. గ్రామపంచాయతీ లేఅవుట్ అయినప్పటికీ ప్లాట్లు, భవనాలకు ఎల్ఆర్ఎస్, బీఆర్ఎస్ అనుమతులు మంజూరైనట్లు గుర్తించారు. పార్కు పక్కన ఉన్న ప్లాట్ల విక్రయ పత్రాలు, ఆమోదిత లేఅవుట్, నమోదిత పత్రాలు, క్షేత్రస్థాయి పరిశీలన, కాలనీ వాసుల వాంగ్మూలాలను పరిశీలించిన అనంతరం 1,166 చదరపు గజాల ఈ స్థలం పూర్తిగా పార్కు స్థలమేనని హైడ్రా తేల్చింది. దీంతో ఆక్రమణదారులు ఏర్పాటు చేసిన అక్రమ కంచెలను తొలగించిన అధికారులు, పార్కు స్థలమని సూచిస్తూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేశారు. అలాగే స్థల సరిహద్దులను గుర్తించి కొత్తగా ఫెన్సింగ్ ఏర్పాటు చేసి పార్కు స్థలాన్ని పరిరక్షించారు.



## మొక్కల సంరక్షణ అందరి బాధ్యత..



హత్నూర, జూన్ 30,(సిరి న్యూస్)

నాటిన మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపీఈఓ యూసుఫ్ అన్నారు. మంగళవారం హత్నూర మండలం గుండ్లమాచునూరు గ్రామంలో సర్పంచ్ శ్రీహరితో కలిసి ఎంపీఈఓ యూసుఫ్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ హరితహారం లో భాగంగా గ్రామాలలో ఎక్కడ స్థలం ఉంటే అక్కడ మొక్కలు నాటాలని కోరారు. నాటిన మొక్కలను వృక్షాలుగా పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. వాతావరణం పరిరక్షణ కోసం మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తే భవిష్యత్ తరాల కోసం భారీ వృక్షాలుగా విరాజిల్లుతూ వర్షాలు కురిపిస్తాయని పేర్కొన్నారు. గ్రామాలలో ఖాళీ స్థలం ఎక్కడ ఉంటే అక్కడ మొక్కలు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శంకర్, ఫీల్డ్ అసిస్టెంట్ విజయ్, వార్డు సభ్యులతోపాటు గ్రామపంచాయతీ కార్యదర్శి సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితాను సమీక్షించిన ఆర్ డి ఓ

తూప్రాన్ జూన్ 30 సిరి న్యూస్



తూప్రాన్ మనోహరాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఆర్డిఓ భావయ్య తూప్రాన్ ఇంచార్జ్ తహసిల్దార్ శ్రీకాంత్ తో కలిసి తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని కరీంగూడ పోలింగ్ కేంద్రం (పీఎస్ నెం. 29) తో పాటు నర్సాపూర్ నియోజకవర్గం మనోహరాబాద్ మండల పరిధిలోని పోతారం గ్రామంలో పోలింగ్ కేంద్రాలలో ప్రస్తుతం కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సమీక్షించారు ఆర్ డి ఓ బూత్ స్థాయి అధికారులు బీ ఎల్ ఓ ఎన్యూమరేషన్ ఫారమ్స్ రిజిస్టర్లను బీఎల్ఓ యాప్ పనితీరును స్వయంగా పరిశీలించారు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల ప్రాసెసింగ్‌ను మరింత వేగవంతం చేయాలని ఎక్కడా ఆలస్యం జరగకుండా చూడాలని అధికారులను సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు ఆర్ డి ఓ బావయ్య ఓటర్ల సవరణ కార్యక్రమంపై అవగాహన కల్పించారు అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు ఓటర్ల సవరణ ప్రక్రియను ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని ఆర్ డి ఓ తెలిపారు ఈ కార్యక్రమంలో సంబంధిత బూత్ స్థాయి అధికారులు బీ ఎల్ ఓ గిర్దావర్ గ్రామ పాలనా అధికారులు బూత్ స్థాయి ఏజెంట్లు ప్రజలు పాల్గొన్నారు.

## విజిబుల్ పోలీసింగ్‌పై దృష్టి సారించాలి

**సిద్దిపేట సిపి రష్మీ పెరుమాళ్**



గజ్వేల్, జూన్ 30 (సిరి న్యూస్ )

నేరాల నియంత్రణ, ప్రజా భద్రత, విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని సిద్దిపేట సిపి రష్మీ పెరుమాళ్ సూచించారు. మంగళవారం గజ్వేల్ రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేసి, సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణ, ప్రజలకు అందుతున్న సేవలను సమీక్షించారు.గ్రేవ్ కేసులు, ముఖ్యంగా పోక్సో కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు జరిపి నిందితులకు శిక్షలు పడేలా చూడాలని సూచించారు. రౌడీ, హిస్టరీ షీటర్లపై నిఘా పెంచడంతో పాటు సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు.ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటడంతో పాటు సీసీ కెమెరాలు, పార్కింగ్ షెడ్‌ను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ నర్సింలు, సి.ఐ రవిరాజు, ఎస్సైలు ఆరోగ్యం, రఘుపతి, కృష్ణ రెడ్డి , యోనుస్ ఖాన్ మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

# మంజూరైన రోడ్డు పనులు ప్రారంభం ఎప్పుడో..

- **నార్సింగి–పెద్దశంకరంపేట రహదారిపై ప్రజల ఎదురుచూపులు**
- **కంకర రోడ్డుతో నిత్యం అవస్థలు.. త్వరగా పనులు ప్రారంభించాలని ప్రజల ఆకాంక్ష**

మెదక్ జూన్ 30 సిరి న్యూస్



మెదక్ జిల్లానార్సింగి నుంచి పెద్దశంకరంపేట(ఏ) వరకు ఉన్న ప్రధాన రహదారి ప్రస్తుతం ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తోంది. ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణించే ఈ మార్గం పూర్తిగా దెబ్బతిని కంకర రోడ్డుగా మారడంతో ప్రయాణం ఎంతో కష్టంగా మారింది. రహదారి అభివృద్ధికి అనుమతులు మంజూరయ్యాయని సమాచారం రావడంతో ప్రజల్లో కొత్త ఆశలు చిగురించాయి. అయితే ఇప్పుడు అందరి నోట ఒకటే ప్రశ్న వినిపిస్తోంది మంజూరైన రోడ్డు పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయిఈ రహదారి నార్సింగి పెద్ద శంకరంపేట ప్రాంతాల మధ్య రాకపోకలకు కీలక మార్గంగా ఉంది. ప్రతి రోజు ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, విద్యార్థులు, రైతులు, వ్యాపారులు, చిన్నచిన్న వ్యాపారులు, పాల సేకరణ వాహనాలు, సరుకు రవాణా వాహనాలు, అత్యవసర సేవల వాహనాలు ఈ మార్గాన్ని ఉపయోగిస్తున్నాయి. కానీ రహదారి దెబ్బతినడంతో ప్రతి ప్రయాణం ఒక సవాలుగా మారింది.ప్రస్తుతం రహదారిపై బిటుమెన్ పూర్తిగా తొలగిపోయి కంకర బయట పడింది. పెద్ద పెద్ద గుంతలు, ఎగుడు దిగుడు కారణంగా వాహనాలు నెమ్మదిగా నడపాల్సి వస్తోంది. ద్విచక్ర వాహనదారులు ప్రతి క్షణం అప్రమత్తంగా ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. చిన్నపాటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.వర్షాకాలం ప్రారంభమైన తర్వాత పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. గుంతల్లో వర్షపు నీరు నిల్వ ఉండటంతో రహదారి ఎక్కడ ఉందో, గుంత ఎక్కడ ఉందో గుర్తించడం కూడా కష్టంగా మారుతోంది. దీంతో వాహనాలు అదుపు తప్పే ప్రమాదం పెరుగుతోంది. మరోవైపు ఎండాకాలంలో కంకర, దుమ్ము కారణంగా ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.ఈ రహదారిపై ప్రయాణించే విద్యార్థులు ప్రతిరోజూ సమయానికి పాఠశాలలు, కళాశాలలకు చేరుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగులు కూడా కార్యాలయాలకు ఆలస్యంగా చేరుకునే పరిస్థితి ఏర్పడుతోంది. రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకెళ్లడానికి ఎక్కువ సమయం వెచ్చించాల్సి వస్తోంది. రవాణా ఖర్చు పెరగడంతో పాటు వాహనాల మరమ్మతులకు అదనపు ఖర్చు భరించాల్సి వస్తోందని వారు చెబుతున్నారు.ఈ మార్గంలో ప్రయాణించే వాహనాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ, రహదారి పరిస్థితి మాత్రం అందుకు అనుగుణంగా లేదు. గుంతలను తప్పించుకునే ప్రయత్నంలో ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఇబ్బందులు పడుతున్నాయి. రాత్రి వేళల్లో వెలుతురు తక్కువగా ఉండటంతో ప్రమాదాల అవకాశాలు మరింత పెరుగుతున్నాయని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.రహదారి అభివృద్ధి పూర్తయితే కేవలం ప్రయాణ సమయం తగ్గడమే కాదు, ఈ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలపై కూడా సానుకూల ప్రభావం పడుతుంది. వ్యవసాయ ఉత్పత్తుల రవాణా సులభమవుతుంది. విద్యార్థులు, ఉద్యోగులు సమయానికి గమ్యస్థానాలకు చేరుకోగలుగుతారు. వ్యాపార కార్యకలాపాలు మరింత వేగవంతమవుతాయి. అత్యవసర వైద్య సేవలు కూడా త్వరగా అందే అవకాశం ఉంటుంది.ప్రజల అభిప్రాయం ప్రకారం, నాణ్యమైన రహదారి నిర్మాణం ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో అవసరం. పనులు ప్రారంభమైన తర్వాత నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, దీర్ఘకాలం మన్నికగా ఉండే విధంగా నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. భవిష్యత్తులో తరచూ మరమ్మతులు చేయాల్సిన పరిస్థితి రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు ఆశిస్తున్నారు

# భీంపూర్‌లో రాజకీయ రగడ.. కుల బహిష్కరణ.?..

## పార్టీ మారలేదని కుల బహిష్కరణ

- **మంచిర్యాల జిల్లాలో కలకలం..**
- **ఉపాధి హామీ పనులకు అడ్డుకున్నారన్న బాధితులు..**
- **పోలీసులను ఆశ్రయించిన గుర్ల చంద్రశేఖర్ కుటుంబం..**
- **విచారణతో పూర్తి నిజాలు వెలుగులోకి రానున్నాయి..**

మంచిర్యాల జూన్ 30 (సిరి న్యూస్)

పార్టీ మారేందుకు నిరాకరించడంతో తమను కుల బహిష్కరణకు గురిచేయడంతో పాటు ఉపాధి హామీ పనులకు వెళ్లకుండా అడ్డుకుంటున్నారని ఓ కుటుంబం ఆరోపించడం మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలం జజ్జరవెల్లి గ్రామపంచాయతీ పరిధిలోని భీంపూర్ గ్రామంలో కలకలం రేపింది. బాధితులు పోలీసులను ఆశ్రయించి న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. బాధితుల కథనం ప్రకారం.. ఇటీవల జజ్జరవెల్లి గ్రామంలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుతో గుర్ల తానక్క నాలుగో వార్డు సభ్యురాలిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సర్పంచ్ పదవికి భారత రాష్ట్ర సమితి మద్దతుదారులు విజయం సాధించారని తెలిపారు. అనంతరం తమ పార్టీ వైపు రావాలని గ్రామంలోని కొందరు కుల పెద్దలు ఒత్తిడి తెచ్చారని గుర్ల తానక్క భర్త గుర్ల చంద్రశేఖర్ ఆరోపించారు. పార్టీ మారేందుకు అంగీకరించకపోవడంతో ఉపాధి హామీ పనులకు వెళ్లకుండా అడ్డుకోవడంతో పాటు గ్రామంలో జరిగే శుభకార్యాలకు కూడా తమను పిలవకుండా కుల బహిష్కరణ చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై కన్నెపల్లి పోలీసు



స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ వీడియో ద్వారా తమ గోడును వెల్లడించారు. అయితే ఈ ఆరోపణలపై గ్రామ పెద్దలు లేదా సంబంధిత వర్గాల స్పందన తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టగా, పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

# సర్ ప్రక్రియను పూర్తిస్థాయిలో పారదర్శకంగా నిర్వహించాలి

- **బట్టు దయానంద రెడ్డి సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు**

గజ్వేల్ జూన్ 30 ( సిరి న్యూస్ )

ప్రస్తుత కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న సర్ ప్రక్రియను పూర్తిస్థాయిలో పారదర్శకంగా నిర్వహించాలని సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు బట్టు దయానంద రెడ్డి కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్ ప్రక్రియలో భాగంగా బూత్ లెవల్ ఆఫీసర్లు (బిఎల్ఓలు) ఇంటింటికి ఫారాలు అందజేస్తున్నప్పటికీ, సమయం తక్కువగా ఉండటంతో ప్రతి ఓటర్ వివరాలను 2002 ఓటర్ లిస్ట్ ప్రకారం సమగ్రంగా పరిశీలించడంలో ఆసక్తి చూపడం లేదని తెలిపారు. చాలా సందర్భాల్లో ఫోన్ ద్వారా



2002 ఓటర్ లిస్ట్ డౌన్లోడ్ చేసుకుని పరిశీలించుకోవాలని సూచించడం జరుగుతోందని అన్నారు.గ్రామీణ ప్రాంతాల్లోని సాధారణ ప్రజలకు ఫోన్ ద్వారా ఓటర్ లిస్ట్ పరిశీలించడం, ఫారాలు నింపడం సులభం కాదని, దీని వలన చదువురాని అమాయకులైన పలువురు ఓటర్ల పేర్లు జాబితా నుండి తొలగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి ఓటు హక్కు దెబ్బతినే అవకాశం ఉందని పేర్కొన్నారు.అందువల్ల ప్రతి బూతుకు సంబంధించిన 2002 ఓటర్ లిస్టులను ఆయా గ్రామాలకు సరఫరా చేయాలని, బిఎల్ఓలకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని కోరారు. అలాగే ప్రతి ఓటర్ నుండి ఫారాలను సక్రమంగా నింపించి స్వీకరించేందుకు తగిన ఆదేశాలు ఇవ్వాలని సూచించారు.ఇంకా బిఎల్ఓలకు సహాయకులుగా ఇద్దరు లేదా ముగ్గురు చదువుకున్న వ్యక్తులను నియమించి, సర్ ప్రక్రియను పారదర్శకంగా, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే విధంగా అమలు చేయాలని అందుకు ఎన్నికల కమిషన్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

- **నూతన ఎస్ఐ అరుణ్ కుమార్ గౌడ్‌కు గుమ్మడిదల మున్సిపల్ పాలకవర్గం ఘన సన్మానం**

గుమ్మడిదల జూన్ 30 (సిరి న్యూస్):

గుమ్మడిదల మండల నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన అరుణ్ కుమార్ గౌడ్‌ను గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో మున్సిపల్ పాలకవర్గం ఘనంగా సన్మానించింది. శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తూ ప్రజలకు మరింత సమర్థవంతమైన పోలీసు సేవలు అందించాలని ఎస్ఐని కోరారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తూ పోలీసు శాఖపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసేలా పనిచేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, పోలీసు శాఖ పరస్పర సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధితో పాటు ప్రశాంత వాతావరణం నెలకొంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, శాంతిభద్రతల పరిరక్షణలో మున్సిపాలిటీ తరఫున పోలీసు శాఖకు సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఎస్ఐ అరుణ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రజల సహకారంతో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ



కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ చిమ్ముల సంధ్యా, వార్డు కౌన్సిలర్లు ఆకుల మాధవి, మేడిపల్లి మురళి, సురభి కుమార్ గౌడ్, చూర్ణం చక్రపాణి, బెంబడి సంజీవరెడ్డి, ఆర్ల కిషన్, నాయకులు వెంకట్రాం రెడ్డి, ఆకుల సత్యనారాయణ, మద్ది శేఖర్ రెడ్డి, పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, చప్పటి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అండగా రైతు భరోసా

నర్సాపూర్ జూన్ 30 (సిరి న్యూస్)

పంటలు పండించుటకు రైతులకు ఖర్చులు అధికం అవుతున్నాయి కాబట్టి ప్రభుత్వం రైతులకు చేదోడుగా ఉండాలని ఉద్దేశంతో రైతు భరోసా అనే పథకం ప్రవేశపెట్టింది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతు భరోసా నిధులు విడుదల సందర్భంగా మంగళవారం మండలంలో లింగాపూర్ గ్రామంలో రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ వ్యవసాయ శాఖ అధికారి, డివిజన్ స్థాయి అధికారి,నర్సాపూర్ మండల ఎమ్మార్వో శ్రీనివాస్ మండల స్థాయి అధికారి , ఏఈవోలు పాల్గొన్నారు



# ఎడుపాయలకు .7 కోట్లతో ఆధ్యాత్మిక

- పర్యాటక అభివృద్ధికి కొత్త అధ్యాయం
- 12 ఎకో–ఫ్రెండ్లీ కాటేజీల నిర్మాణానికి పరిపాలనా అనుమతి
- భక్తుల సౌకర్యాలే ప్రభుత్వ లక్ష్యం





**మెదక్, జూన్ 30 సిరి న్యూస్**

తెలంగాణలోని ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రాలలో ఒకటైన ఎడుపాయల శ్రీ వనదుర్గ భవాని అమ్మవారి దేవస్థానం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు తరలివచ్చే ఈ పుణ్యక్షేత్రంలో భక్తులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం రూ.7 కోట్ల వ్యయంతో 12 ఎకో–ఫ్రెండ్లీ కాటేజీల నిర్మాణానికి పరిపాలనా అనుమతి మంజూరు చేసింది. ఈ మేరకు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉత్తర్వులు జారీ కావడంతో ఎడుపాయల అభివృద్ధిపై కొత్త ఆశలు చిగురించాయి.ఎడుపాయల పేరు వినగానే తెలంగాణ ప్రజలకు ముందుగా గుర్తుకు వచ్చేది వనదుర్గ భవాని అమ్మవారి జాతర. రాష్ట్ర నలుమూలలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ వంటి పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో ఇక్కడికి చేరుకుంటారు. జాతర సమయంలో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడుతాయి. అయితే భక్తుల సంఖ్యకు తగిన స్థాయిలో వసతి సౌకర్యాలు లేకపోవడం చాలా కాలంగా ప్రధాన సమస్యగా మారింది. ముఖ్యంగా కుటుంబ సమేతంగా వచ్చే భక్తులు రాత్రి బస విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం భక్తుల్లో ఆనందాన్ని నింపింది.పర్యాటక శాఖ ప్రతిపాదనల మేరకు తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టు అమలు కానుంది. ప్రకృతికి ఎలాంటి హాని కలగకుండా, ఎడుపాయల సహజ సౌందర్యాన్ని కాపాడుతూ, ఆధునిక సదుపాయాలతో కూడిన కాటేజీలను నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించారు. ప్రతి కాటేజీలో విశాలమైన గదులు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, విద్యుత్, భద్రతా ఏర్పాట్లు, కుటుంబాలకు అనువైన వాతావరణం వంటి అన్ని సదుపాయాలు కల్పించనున్నారు.ఈ ప్రాజెక్టు కేవలం భక్తుల వసతి కోసం మాత్రమే కాదు. ఎడుపాయలను రాష్ట్రంలో ప్రముఖ ఆధ్యాత్మిక–పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ దీర్ఘకాలిక లక్ష్యంలో భాగంగా దీనిని అధికారులు పేర్కొంటున్నారు. పర్యాటకులు ఎక్కువ రోజులు బస చేసే అవకాశాలు పెరిగితే స్థానిక ఆర్థిక వ్యవస్థకు కూడా కొత్త ఊపు వస్తుందని నిపుణులు భావిస్తున్నారు. హోటళ్లు, చిన్న వ్యాపారాలు, ఆటో డ్రైవర్లు, స్థానిక కళాకారులు, చేతివృత్తుల వారికి ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది.ఎడుపాయల అభివృద్ధిపై గతంలో కూడా అనేక ప్రతిపాదనలు వచ్చినప్పటికీ, భారీ స్థాయిలో వసతి సౌకర్యాల కోసం నిధులు మంజూరు కావడం ఇదే తొలిసారి అని స్థానికులు చెబుతున్నారు. ఆలయానికి వచ్చే భక్తులు ఇకపై తాత్కాలిక టెంట్లు లేదా దూర ప్రాంతాల్లో గదులు వెతుక్కోవాల్సిన అవసరం లేకుండా, ఆలయ సమీపంలోనే సౌకర్యవంతమైన బస చేసే అవకాశం కలగనుంది.ఈ నిర్ణయం భక్తులకు మాత్రమే కాకుండా మొత్తం మెదక్ జిల్లాకే ప్రయోజనం చేకూర్చే అభివృద్ధి కార్యక్రమంగా భావిస్తున్నారు. పర్యాటక రంగం అభివృద్ధి చెందితే జిల్లా ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు కొత్త పెట్టుబడులకు కూడా nఅవకాశం ఏర్పడుతుంది. భవిష్యత్తులో రహదారుల విస్తరణ, పార్కింగ్, తాగునీరు, పారిశుద్ధ్యం, ఉద్యానవనాలు, సమాచార కేంద్రాలు, ఫుడ్ కోర్టులు వంటి మరిన్ని అభివృద్ధి పనులు కూడా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.ఎడుపాయల జాతర సమయంలో ఒకేసారి లక్షలాది మంది భక్తులు వచ్చే పరిస్థితుల్లో ఆధునిక వసతి సౌకర్యాల నిర్మాణం అత్యంత అవసరమని అధికారులు కూడా గుర్తించారు. అందుకే ఆలస్యం చేయకుండా పరిపాలనా అనుమతులు మంజూరు చేసి పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. త్వరలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి నిర్మాణ పనులు ప్రారంభమయ్యే అవకాశముందని తెలుస్తోంది.భక్తుల విశ్వాసానికి, పర్యాటక అభివృద్ధికి, స్థానిక ఆర్థిక వ్యవస్థకు, జిల్లా ప్రతిష్ఠకు ఈ ప్రాజెక్టు ఒక మైలురాయిగా నిలుస్తుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న అభివృద్ధి పనులు ఇప్పుడు కార్యరూపం దాల్చనున్న నేపథ్యంలో ఎడుపాయల భవిష్యత్తుపై కొత్త ఆశలు వ్యక్తమవుతున్నాయి.

# జొన్నల కొనుగోలులో ప్రభుత్వం నిర్లక్ష్యం.

- నిరసిస్తూ కలెక్టర్‌కు బీజేపీ వినతి.
- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాగి రాములు.

**రామాయంపేట, జూన్ 30 (సిరి న్యూస్)**



జొన్నల కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న మొండి వైఖరిని నిరసిస్తూ గత 60 రోజులుగా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన కార్యక్రమాలు చేపట్టినా ప్రభుత్వం స్పందించకపోవడం వల్ల జొన్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని భారతీయ జనతా పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు.రామాయంపేట మార్కెట్ యార్డులో నిల్వ ఉన్న జొన్నలను వెంటనే కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నాడు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, దంతపల్లి సర్పంచ్ బాలరాజ్, అక్కన్నపేట మాజీ సర్పంచ్ సిద్ధ రాములు, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శేఖర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సతీష్, అసెంబ్లీ కన్వీనర్ సాయి తదితరులు పాల్గొన్నారు.నిల్వలో ఉన్న జొన్నలను ఆలస్యం చేయకుండా వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని రాగి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.జొన్నలు పండించిన రైతులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదని, కేంద్రాలను ప్రారంభించి రైతుల నుంచి జొన్నలను కొనుగోలు చేయాలని, ఈ ఏడాది జొన్న పంట సాగు చేసిన రైతులు మార్కెట్‌లో సరైన ధర లేక, ప్రభుత్వ కొనుగోళ్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. రైతులు పండించిన ప్రతి పంటను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. మట్టి పెల్లలు ఉన్నాయనే కారణంతో జొన్నలను తిరస్కరించడం సమంజసం కాదన్నారు. గతంలో మొలకలు వచ్చిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ, అదే విధంగా జొన్నలను కూడా వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.జొన్నల కొనుగోలులో జరుగుతున్న జాప్యం వల్ల రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారని, ప్రభుత్వం ఇకనైనా స్పందించి రైతులకు న్యాయం చేయాలని రాగి రాములు కోరారు.

# 2028 తెలంగాణపై బీజేపీ గురి..

- 2028లో తెలంగాణ బీజేపీదే..నితిన్ నబీన్ ధీమా..
- కాళేశ్వరం, మూసీలో అవినీతి ఆరోపణలు..
- ఢిల్లీకి నిధుల తరలింపు..రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు..
- హామీల్లో తెలంగాణ రాష్ట్రం
- ఫెయిల్..ప్రజా ఉద్యమం హెచ్చరిక..

**ఘట్‌కేసర్, ( మేడ్చల్ ప్రతినిధి: జూన్ 29 సిరి న్యూస్ )**



తెలంగాణ రాజకీయాల్లో సంచలనం రేపేలా బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నితిన్ నబీన్ కీలక వ్యాఖ్యలు చేశారు. 2028 ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేయడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. ఘట్‌కేసర్ మండలం అంక్షాపూర్‌లో జరిగిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ, రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు.కాళేశ్వరం ప్రాజెక్టు, మూసీ రివర్‌ఫ్రంట్ పనుల్లో భారీ అవినీతి జరిగిందని ఆరోపించిన నితిన్ నబీన్, ఆర్‌ఆర్ పన్ను పేరుతో రాష్ట్ర నిధులను ఢిల్లీకి తరలిస్తున్నారంటూ సంచలన ఆరోపణలు గుప్పించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, దీనిపై ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.మరోవైపు, 2019, 2024 ఎన్నికల ఫలితాలను ప్రస్తావిస్తూ తెలంగాణలో పార్టీ ఓటు బ్యాంకు పెరుగుతోందని, ఇది రాబోయే విజయానికి సంకేతమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 22 రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉండటం మోదీ నాయకత్వంపై ప్రజల విశ్వాసానికి నిదర్శనమని చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు, జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, డీకే అరుణ, కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, ఎంపీ కె. లక్ష్మణ్ తదితరులు పాల్గొనడంతో ఈ సమావేశం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఇది మరింత మెరుగు చేయాలంటే చెప్పండి, ఇంకా స్ట్రాంగ్ హెడ్‌లైన్, సోషల్ మీడియా క్యాప్షన్, లేదా వేరే పొడవులో కావాలంటే చెప్పండి..

# పక్కగా భూ హక్కులకోసం రీసర్వే

- భూ క్రయవిక్రయాల్లో మ్యాపులను అప్డేట్ చేయాలి
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**శివంపేట్ జూన్ 30 ( సిరి న్యూస్ )**



మంగళవారం శివంపేట్ మండలం లోని బీక్యాతాండలో ల్యాండ్ సర్వే డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో భూభారతి భూముల రిసర్వే గ్రామసభ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ,ఆర్డీవో ఎడి సర్వే ఎంపీడీవో గ్రామ సర్పంచ్ తో కలిసి పాల్గొన్నరూ ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..శివంపేట మండలం 1946 సంవత్సరంలో రిసర్వే అయిందని, అప్పటి నుంచి చాలా సమస్యలు ఉన్నాయన్నారు. భూమి క్రయవిక్రయాల్లో మ్యాపులను కూడా అప్డేట్ చేయాలన్నారు.గ్రామాల్లో భూ నక్షల్లో సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. భూ రీ సర్వే కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేసి ప్రతి భూ కమతానికి ఆన్లైన్ డిజిటలైజేషన్లో పొంద పరుస్తామన్నారు. ఏలాంటి భూ వివాదాలు లేకుండా చేసి,భూమికి భూధార్ ను అందించడం జరుగుతుందన్నారు. భూ సమస్యలు లేకుండా చేయడమే దీని ఉద్దేశం అన్నారు.అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ... శాశ్వతంగా భూ సమస్యల పరిష్కారం కోసమే భూ రీ సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ల్యాండ్ సర్వే అధికారి ఎ . కిషన్,, ఎంపిడిఓ వెంకటలక్ష్మమ్మ మండల బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పబ్బ రమేష్ గుప్తా, శివంపేట్ సర్పంచ్ రాజీపేట వెంకటేశ్వర్లు, తిమ్మాపూర్ సర్పంచ్, రాజు, తలపల్లి తండా లక్ష్మి గేమసింగ్,భిక్య తండా గ్రామ సర్పంచ్ నేనావత్ విజయ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

## పలుగుగడ్డ సర్పంచ్ నర్ర కనకయ్య



**గజ్వేల్ జూన్ 30 (సిరి న్యూస్ )**

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జగదేవపూర్ మండల పరిధి పలుగు గడ్డ గ్రామ సర్పంచ్ నర్ర కనకయ్య అన్నారు. మంగళవారం గ్రామాన్ని పర్యటించి పరిశుభ్రత పరిస్థితులను పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు ఇంటి పరిసరాలు, వీధులను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు రాకుండా ఉండాలంటే ఇంటి పరిసరాలలో చెత్త, మురుగు నీరు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు .ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ స్వప్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రేషన్ గోదాం వద్ద డీలర్ల ధర్నా



**తూప్రాన్ జూన్ 30 సిరి న్యూస్**

తూప్రాన్ మనోహరాబాద్ శివ్వం పేట్ మండలాలకు చెందిన రేషన్ డీలర్లు తూకం లో తక్కువ వస్తున్నాయి అని తూప్రాన్ రేషన్ బియ్యం గోదాం వద్ద మంగళవారం ధర్నాకు దిగారు గోదాం నుండి వచ్చే రేషన్ బియ్యం తుకంలో తక్కువ రావడం వల్ల రేషన్ డీలర్లకు నష్టం వస్తుందని డీలర్ షాపు వద్ద బియ్యం తూకం చేసి సరఫరా చేయాలని డీలర్లు డిమాండ్ చేశారు ప్రభుత్వం వెంటనే స్పందించి రేషన్ షాప్ డీలర్లకు జరుగుతున్న నష్టాన్ని పరిశీలించి తూకం చేసి నష్టం రాకుండా చూడాలని డీలర్లు కోరుచున్నారు ఈ ధర్నా లో పట్టాభి శ్రీనివాస్ రాజు షేఫీ అమరేందర్ రెడ్డి శ్రీనివాస్ నాగేష్ మిగతా గ్రామాల డీలర్లు పాల్గొన్నారు

# గాంధీ ఫెలోషిప్‌కు గీతం విద్యార్థిని నివేదిత ఎంపిక..

**పటాన్చెరు, జూన్ 30 (సిరి న్యూస్):**



ప్రతిష్టాత్మక గాంధీ ఫెలోషిప్ కార్యక్రమానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్‌కు చెందిన ఎం.ఏ. ఎకనామిక్స్ విద్యార్థిని ఆర్. నివేదిత ఎంపికైంది. ఈ విషయాన్ని గీతం విశ్వవిద్యాలయ వర్గాలు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించాయి.న్యూఢిల్లీలోని పిరమల్ ఫౌండేషన్ నిర్వహించే ఈ గాంధీ ఫెలోషిప్ 23 నెలల పాటు సాగే జాతీయ స్థాయి నాయకత్వ అభివృద్ధి కార్యక్రమం. యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తూ, క్షేత్రస్థాయిలో సామాజిక మార్పు కోసం పనిచేసే అవకాశాన్ని ఈ కార్యక్రమం కల్పిస్తుంది.నివేదిత ఎంపిక పట్ల గీతం విశ్వవిద్యాలయ నాయకత్వం హర్షం వ్యక్తం చేస్తూ ఆమెను అభినందించింది. ఈ ఫెలోషిప్ ద్వారా సమాజ సేవలో విశిష్ట సేవలు అందిస్తూ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించింది.

# వెల్దుర్తి మండల కేంద్రంలో ఘనంగా బోనాల పండుగ



**వెల్దుర్తి, జూన్ 30, (సిరి న్యూస్):**

వెల్దుర్తి మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ 11వ వార్షికోత్సవ సందర్భంగా మంగళవారం అమ్మవారికి గౌడ సంఘం ఆధ్వర్యంలో మహిళలు ఘనంగా బోనాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నర్సాపూర్ ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి, నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి హాజరయ్యారు. శివసతుల విన్యాసాలు, పోతురాజుల కొరడా విన్యాసాలు, డప్పు సప్పుల వాయిద్యాల,మధ్య ఘనంగా అమ్మవారికి బోనాలు నిర్వహించారు. అంతకు ముందు గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, అలాగే నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డికి,ఘన స్వాగతం పలికి శాలువా లతో సన్మానించారు. అనంతరం అమ్మవారి సన్నిధికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. రేణుక ఎల్లమ్మ కరుణా కటాక్షం వలన వెల్దుర్తి మండల ప్రజలు సుఖశాంతులతో అష్టైశ్వర్యాలతో సుఖమైన జీవితం గడపాలని అమ్మవారి కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటల తో కళకళలాడాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం ఆలయ కమిటీ నిర్వాహకులు ఆయా పార్టీల ప్రజాప్రతి నిధులు భక్తులు పాల్గొన్నారు.

# వేధింపులకు 'నో' చెప్పండి.. షీ టీమ్ భరోసా..

- వేధింపులపై మౌనం వద్దు.. వెంటనే షీ టీమ్‌కు ఫిర్యాదు..
- ఫిర్యాదుదారుల వివరాలు పూర్తి గోప్యం..
- డీసీపీ భాస్కర్
- ధైర్యంగా నో చెప్పడం నేర్చుకోండి..
- విద్యార్థినులకు సూచన
- మహిళల భద్రతకు షీ టీమ్ 24 గంటల సేవలు

**మంచిర్యాల జూన్ 29 (సిరి న్యూస్)**

మహిళలు, విద్యార్థినుల భద్రతే లక్ష్యంగా మంచిర్యాల సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో షీ టీమ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంచిర్యాల షీ టీమ్ ఉప పరిశీలకురాలు ఉషారాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మంచిర్యాల డిప్యూటీ పోలీసు కమిషనర్ ఏ. భాస్కర్, సహాయ పోలీసు కమిషనర్ ఆర్. ప్రకాష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డిప్యూటీ పోలీసు కమిషనర్ ఏ. భాస్కర్ మాట్లాడుతూ, మహిళలు, విద్యార్థినులు ఎలాంటి వేధింపులు ఎదురైనా మౌనంగా ఉండకుండా వెంటనే షీ టీమ్‌ను ఆశ్రయించాలని సూచించారు. పోలీసు స్టేషన్‌కు వెళ్లడానికి భయపడాల్సిన అవసరం లేదని, ఫిర్యాదు చేసిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచి బాధితులకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. సామాజిక మాధ్యమాలు, ఫోన్ కాల్స్, సందేశాలు లేదా ప్రత్యక్షంగా జరిగే వేధింపులను సహించకుండా వెంటనే తెలియజేయాలని చెప్పారు. విద్యాసంస్థలు, వసతి గృహాలు, నివాస ప్రాంతాలు, ఉద్యోగ ప్రదేశాలు, ప్రయాణ సమయంలో ఎదురయ్యే ఇబ్బందులపై షీ టీమ్ ఇరవై నాలుగు గంటలు సేవలు అందిస్తుందని తెలిపారు. జీవితంలో సరైన నిర్ణయాలు తీసుకోవాలంటే అవసరమైనప్పుడు ధైర్యంగా నో చెప్పడం అలవర్చుకోవాలని, ఇతరులను అనుసరించకుండా తమ ఆసక్తి, ప్రతిభకు అనుగుణంగా చదువు, వృత్తిని ఎంచుకోవాలని విద్యార్థినులకు సూచించారు. సమస్యలను భయపడకుండా విశ్లేషించి పరిష్కార మార్గం వెతికితే ప్రతి సవాలును అధిగమించవచ్చని అన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, షీ టీమ్ ఇన్‌చార్జి ఉప పరిశీలకురాలు ఉషారాణి, కళాశాల ఉప ప్రిన్సిపాల్ అనూష, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



# బెల్లంపల్లి అభివృద్ధికి మున్సిపల్ సభ.



- అభివృద్ధి అజెండాపై మున్సిపల్ సభ..
- పట్టణ సమస్యలపై విస్తృత చర్చ..
- మౌలిక వసతుల మెరుగుదలకు నిర్ణయాలు..
- బెల్లంపల్లి అభివృద్ధికి సహకారం కోరిన చైర్‌పర్సన్..

**మంచిర్యాల జూన్ 30 ( సిరి న్యూస్)**

పట్టణ అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని బెల్లంపల్లి మున్సిపల్ సాధారణ సభలో నిర్ణయించారు. మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, వివిధ వార్డుల్లో నెలకొన్న సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై సభ్యులు విస్తృతంగా చర్చించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సాధారణ మున్సిపల్ సభకు మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి అధ్యక్షత వహించారు. మాజీ చైర్‌పర్సన్ రమేష్ బాబు, ఉపాధ్యక్షుడు రాగంశెట్టి సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు. సభలో పట్టణంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, రహదారుల నిర్వహణతో పాటు ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు చేపట్టాల్సిన చర్యలపై సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దావ స్వాతి మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికా రులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె కోరారు.

# అభివృద్ధికి ప్రతీకలుగా గ్రామాలు

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- భానూరు, క్యాసారం గ్రామాల్లో రూ.30 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన




**పటాన్‌చెరు, జూన్ 30 (సిరి న్యూస్):**

పటాన్‌చెరు నియోజకవర్గంలోని గ్రామాలను అభివృద్ధికి ప్రతీకలుగా తీర్చిదిద్దుతున్నామని స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని భానూరు, క్యాసారం గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఈజీఎస్) నిధులతో రూ.30 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు సోమవారం సాయంత్రం ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులతో పాటు సీఎస్ఆర్ నిధులను కూడా సమీకరించి గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామంలో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సర్పంచులు శాంతయ్య, గోవర్ధన్ రెడ్డి, ప్రభాకర్, గోపాల్, శ్యాంసుందర్ రెడ్డి, శ్రీనివాస్, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫీజుల దోపిడీపై కదిలిన విద్యాశాఖ..

- సిరి తెలుగు దినపత్రిక కథనాలకు జిల్లా విద్యాశాఖ స్పందన..
- ప్రైవేట్ పాఠశాలలకు డీఈఓ చంద్రయ్య కీలక ఆదేశాలు..
- ఫీజుల పూర్తి వివరాలు బహిరంగంగా ప్రదర్శించాల్సిందే..
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక..
- సిరి తెలుగు దినపత్రికకు విద్యార్థి సంఘాల కృతజ్ఞతలు..


PROCEEDINGS OF THE DISTRICT EDUCATIONAL OFFICER(FAC), MANCHERIAL
Present: Sri. P.Chandraiah I.A.S.,

Rc.No.B1/3741/Grievances/2024. Date: 24.06.2026.

Sub: School Education - Grievance petition of Sri. D. Srikanth, District Secretary, PDSU, Mancherial - Certain Instructions Issued-Reg.

Ref: Petition of Sri. D. Srikanth, District Secretary, PDSU, Mancherial, through "Chief Minister's Prajavani" No. DMNCL08062600046, Dt:08.06.2026.

The petitioner vide reference read above has requested to publish the class wise Fee particulars of all Private Management Schools in their School Notice board, publish the details of parents committee details of every school and display the mobile numbers of the District Collector, District Educational Officers and Essential Emergency Helplines in every school as to solve the problems of students and parents.

Therefore, all the Mandal Educational Officers in the District are hereby directed to take necessary action in the matter by ensuring that all Private Management Schools under their jurisdiction strictly comply with the provisions of G.O.Ms.No.1 and the instructions/orders issued by the Government from time to time.

Hence, the petition of the petitioner is disposed off.

Sd/-P. Chandraiah.
District Educational Officer(FAC),
Mancherial.

To
All the Mandal Educational Officers in the District.
Copy to Sri. D. Srikanth, District Secretary, PDSU, Mancherial, Mobile No.9390341034.
Copy to A4 section of this office.
Copy submitted to the District Collector, Mancherial for kind information.
Copy submitted to the State Nodal Officer, CM Prajavani, MJP Bhavan, Greenland, Hyderabad for information.

//t.c.f.b.o//
Superintendent.




**మంచిర్యాల, జూన్ 29 (సిరి న్యూస్)**

జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లు, విద్యాహక్కు చట్టం అమలులో నిర్లక్ష్యం, పేద విద్యార్థులకు 25 శాతం సీట్ల కేటాయింపుపై సిరి తెలుగు దినపత్రిక ప్రచురించిన వరుస కథనాలు ఫలితాన్నిచ్చాయి. ఇటీవల ఐక్య విద్యార్థి సంఘాలు విద్యాహక్కు చట్టం, 2009ను కచ్చితంగా అమలు చేయాలని, కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ మంచిర్యాలలో విద్యాశాఖ అధికారుల దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన చేపట్టాయి. ఈ ఘటనతో పాటు ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీ, నిబంధనల ఉల్లంఘనలపై సిరి తెలుగు దినపత్రిక వరుసగా కథనాలు ప్రచురించింది. ఈ కథనాల నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ అప్రమత్తమైంది. జిల్లా విద్యాశాఖాధికారి పి. చంద్రయ్య జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను ప్రతి పాఠశాల తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. పాఠశాలల నోటీసు బోర్డుపై తరగతుల వారీ ఫీజుల పూర్తి వివరాలు, తల్లిదండ్రుల కమిటీ సభ్యుల జాబితా, జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి, హెల్ప్‌లైన్ ఫోన్ నంబర్లను తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులతో పాటు జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల ఫీజుల వ్యవహారంపై వస్తున్న ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎంఎస్ నెం.1ను కచ్చితంగా అమలు చేయాలని అన్ని మండల విద్యాధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. నిబంధనలను ఉల్లంఘించే ప్రైవేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ స్పష్టం చేసింది. దీంతో జిల్లాలో ఫీజుల వసూళ్లలో పారదర్శకత పెరిగి, తల్లిదండ్రులకు ఊరట లభించే అవకాశం ఉందని విద్యావర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ పరిణామంపై ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రుల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, సంబంధిత అధికారులను స్పందించేలా చేసిన సిరి తెలుగు దినపత్రిక యాజమాన్యానికి, స్థానిక విలేఖరికి విద్యార్థి సంఘాలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం బాధ్యతాయుతమైన కథనాలు ప్రచురిస్తూ ప్రజల గొంతుకగా నిలుస్తున్న సిరి తెలుగు దినపత్రిక పాత్ర అభినందనీయమని వారు కొనియాడారు. ఇదే విధంగా ప్రజా సమస్యల పరిష్కారానికి దోహదపడే కథనాలను కొనసాగించాలని కోరారు. విద్యార్థి సంఘాల ఆందోళన, సిరి తెలుగు దినపత్రిక వరుస కథనాలు, అనంతరం జిల్లా విద్యాశాఖ స్పందించి చర్యలు ప్రారంభించడం ప్రస్తుతం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణతో పాటు విద్యాహక్కు చట్టం పూర్తి స్థాయిలో అమలయ్యేలా ప్రభుత్వం, విద్యాశాఖ మరిన్ని చర్యలు చేపట్టాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి.

## విద్యాశాఖపై భగ్గుమన్న విద్యార్థి సంఘాలు..

**విద్యాహక్కు చట్టం అమలు చేయాలంటూ నిరసన..**





- విద్యాశాఖ అధికారుల దిష్టిబొమ్మ దహనం..
- ప్రైవేట్ పాఠశాలల ఫీజులపై మండిపాటు..
- 25% సీట్లు పేదలకు కేటాయించాలని డిమాండ్..

మంచిర్యాల, జూన్ 26 (సిరి న్యూస్)

రాజ్యాంగం కల్పించిన విద్యాహక్కు చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని, కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఐక్య విద్యార్థి సంఘాలు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో విద్యాశాఖ అధికారుల దిష్టిబొమ్మను దహనం చేశాయి. ఈ సందర్భంగా ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు చిప్పకుర్తి శ్రీనివాస్ (టీవీయూవీ), వేరాల వంశీ (జేవీఎస్) మాట్లాడుతూ, విద్యాహక్కు చట్టం–2009 ప్రకారం ప్రతి కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలో 25 శాతం సీట్లను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, వికలాంగులు, పేద విద్యార్థులకు కేటాయించాలని చట్టం స్పష్టం చేస్తున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు అమలు చేయకుండా రాజ్యాంగ స్ఫూర్తిని అవమానపరుస్తున్నారని ఆరోపించారు. నిబంధనలను ఉల్లంఘిస్తున్న పాఠశాలలకు అధికారులు అనుమతులు ఇస్తుండటంతో ఫీజుల పేరుతో లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని, విద్యను వ్యాపారంగా మార్చి తల్లిదండ్రులను దోచుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. వెంటనే నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవడంతో పాటు ఫీజులను నియంత్రించి, విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లను పేదలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిప్పకుర్తి సతీష్ మాదిగ (ఎంఎస్ఎఫ్), దుర్గం మనీష్, ముంజంకార్ రితిక్, రౌతు శంకర్ కుమార్, శశి, ప్రశాంత్, శేఖర్ పాల్గొన్నారు..

# ఓటు హక్కు ఉంది కదా అని నిర్లక్ష్యం చేయొద్దు

- ప్రజాస్వామ్యంలో ఓటుకు విలువ
- మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, చిట్టిబాబు

**జోగిపేట, జూన్ 30, (సిరి న్యూస్):**



చాలా మందికి ఇది వరకే ఓట్లు వేస్తున్నాం కదా..మనకు ఓటు హక్కు ఉంది కదా మళ్లీ ఎందుకు నమోదు చేసుకోవాలన్న భ్రమలో ఉన్నందున వారిని చైతన్య పరిచేందుకే వార్డుల వారిగా ఓటర్లను చైతన్య పరుస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఎస్.కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ ఎ.చిట్టిబాబు అన్నారు. అందోలు–జోగిపేట మంగళవారం మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో బీఎల్ఓలు సర్‌లో భాగంగా ఎన్యూమరేషన్ ఫారంల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా పవిత్రమైనదని, అతి విలువైనదన్న విషయాన్న ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకే ఓటుహక్కుయని జాతీయ ఎన్నికల కమిషన్ బీఎల్ఓల ద్వారా ఈ కార్యక్రమాన్ని చేపడుతుందని ఓటర్ల తప్పని సరిగా వారికి సహకరించాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువైనదని, పవిత్రమైనదన్నారు. అర్హత కలిగిన వారందరు ఓటుహక్కును పొందాలని సూచించారు. ఓటు హక్కు అనేది దేశంలోని ప్రతి పౌరుడు రాజ్యాంగం కల్పించిన హక్కు అని ఆయన అన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారితో పాటు ఇదివరకు ఓటు హక్కును కలిగి ఉన్న వారు కూడా ఎస్ఐఆర్‌కు సంబంధించిన ఫామ్‌ను నింపాలని వారు సూచించారు. ఫామ్ నింపడంలో ఏమైనా సందేహాలుంటే ఓటర్లకు నివృత్తి చేయాలని బీఎల్‌వోలను వారు సూచించారు. మున్సిపల్ కో అప్షన్ సభ్యుడు జీషాన్, అత్మకమిటీ డైరెక్టర్ ఎండీ. ఖలీద్, బీఎల్‌వో స్వరూప, నాయకులు ఆడ్డుతో పాటు తదితరులు ఉన్నారు.

# నిజాయితీ సేవలకు నిలువుటద్దం ప్రకాష్ రావు

- జిల్లా పరిశ్రమల అధికారిగా ఆ శాఖకే వన్నెతెచ్చిన వ్యక్తి.
- పదవీ విరమణ మీ జీవితంలో,కొత్త ఆనందాలకు, అనుభవాలకు నాంది పలకాలి.
- జిల్లా పరిశ్రమల అధికారిగా పదవి విరమణ పొందుతున్న రాయల ప్రకాష్ రావు సన్మాన కార్యక్రమంలో కలెక్టర్ ప్రతిమ సింగ్ వెల్లడి.
- జిల్లా పరిశ్రమల అధికారిని ఘనంగా సత్కరించిన జిల్లా అధికారులు.
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్







**మెదక్,జూన్,30 (సిరి న్యూస్)**

అంకిత భావంతో క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ జిల్లా పరిశ్రమల శాఖకు వన్నెతెచ్చిన వ్యక్తిగా ఆయన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ అన్నారు.మంగళవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో 30 సంవత్సరాల సుదీర్ఘకాలం పనిచేసి జిల్లా పరిశ్రమల అధికారిగా పదవీ విరమణ పొందుతున్న రాయల ప్రకాష్ రావు సన్మాన కార్యక్రమానికి అదనపు కలెక్టర్ నగేష్, డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిపిఓ యాదయ్య, ఇతర జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూపదవీ విరమణ అనేది జీవితంలో ఒక గొప్ప ఘట్టం. వారి సుదీర్ఘమైన శ్రమను, అనుభవాన్ని గుర్తించి అభినందించడానికి కొన్ని అద్భుతమైన వేదికగా నిలుస్తుంది అన్నారు.ప్రభుత్వ సేవలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారిగా ఉద్యోగి పాత్ర ఎంతో విలువైనదని, పదవీ విరమణ పొందిన జిల్లా పరిశ్రమల అధికారి తమ విధి నిర్వహణలో నిష్కళంకమైన సేవలు, కర్తవ్యనిష్ఠ, మానవీయ విలువలను చాటుతూ పరిశ్రమల శాఖ ప్రతిష్ఠను పెంపొందించారని ప్రశంసించారు. ఉద్యోగ జీవితం ముగిసినా సమాజానికి వారి అనుభవం, సేవా భావం మార్గదర్శకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. అనంతరం బంధువులు, జిల్లా పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు, స్నేహితులు, పూల బొకే శాలువాలతో ఘనంగా సత్కరించారు.

# మోటార్‌సైకిల్ చోరీల ముఠా గుట్టురట్టు

- ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- నిందితుడి అరెస్ట్
- గుమ్మడిదల టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీల్లో పట్టుబడ్డ దొంగ

**గుమ్మడిదల, జూన్ 30 (సిరి న్యూస్):**



వరుస మోటార్‌సైకిల్ చోరీల కేసులను గుమ్మడిదల పోలీసులు ఛేదించారు. ఈ మేరకు గుమ్మడిదల పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ అరుణ్ కుమార్ వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం ఉదయం గుమ్మడిదల టోల్‌ప్లాజా వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా నర్సాపూర్ వైపు నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో అతడిని ఆపి విచారించారు. తనిఖీలో అతడు రాళ్లబండి మాణిక్యాచారిగా గుర్తించారు. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం రుస్తుంపేట గ్రామానికి చెందిన మాణిక్యాచారి కూలీగా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక బైక్, నర్సాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు బైకులు, పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట నుంచి మరో బైకను చోరీ చేసినట్లు నిందితుడు ఒప్పుకున్నాడని ఎస్ఐ తెలిపారు. దీంతో అతడి వద్ద నుంచి మొత్తం ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.నిందితుడిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. దొంగతనాల నివారణకు పోలీసుల సూచనలు ఇంటి భద్రత కోసం ఇంటి ప్రధాన తలుపులకు నాణ్యమైన తాళాలు అమర్చుకోవాలి.రాత్రి వేళల్లో ఇంటి బయట తగినంత వెలుతురు ఉండేలా చూడాలి.ఇంటిని వదిలి వెళ్లే ముందు తలుపులు, కిటికీలు బిగించి తాళం వేయాలి.నగదు, బంగారం, విలువైన వస్తువులను భద్రమైన లాకర్‌లో ఉంచాలి.ఎక్కువ రోజుల పాటు ఇంట్లో లేకపోతే సమీప బంధువులు, పొరుగువారు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలి.అవసరమైతే సీసీటీవీ కెమెరాలు, అలారం వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలి.అపరిచితులను పూర్తిగా ధృవీకరించకుండా ఇంట్లోకి అనుమతించకూడదు.



**బైక్‌ల భద్రత కోసం:**

బైక్‌ను ఎల్లప్పుడూ హ్యాండిల్ లాక్ చేయాలి.అదనంగా డిస్క్ లాక్ లేదా చైన్ లాక్ వినియోగించాలి.సీసీటీవీ పర్యవేక్షణ ఉన్న లేదా భద్రత కలిగిన ప్రదేశాల్లోనే వాహనాలను పార్క్ చేయాలి.బైక్ తాళాలను వాహనంపైనే వదిలిపెట్టకూడదు.వీలైతే జీపీఎస్ ట్రాకర్ ఏర్పాటు చేసుకోవాలి.ఆర్‌సీ, బీమా వంటి అసలు పత్రాలను బైక్‌లో ఉంచకుండా భద్రంగా దాచుకోవాలి.నిర్మానుష్య ప్రాంతాలు లేదా రోడ్లపై నిర్లక్ష్యంగా బైక్‌లను పార్క్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచించారు.

# మహిళలు భద్రతకై షీ టిమ్స్

- మహిళలు,బాలికల భద్రతకు మెదక్ షీ టీం నిరంతరం కృషి.
- జిల్లాలో 71 మందిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని కౌన్సెలింగ్..
- 12 ఈ-పెట్టీ కేసులు నమోదు.
- జిల్లా వ్యాప్తంగా 42 అవగాహన కార్యక్రమాలు నిర్వహణ
- వేధింపులకు గురైతే వెంటనే షీ టీంను సంప్రదించండి.
- మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు.

**మెదక్,జూన్, 30 (సిరి న్యూస్)**



మహిళలు,బాలికల భద్రతకు మెదక్ జిల్లా పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, మహిళలపై వేధింపులు, ఈవ్‌టీజింగ్, అసభ్య ప్రవర్తన, సైబర్ వేధింపులపై షీ టీం నిరంతరం ప్రత్యేక నిఘా కొనసాగిస్తోందని మెదక్ జిల్లా ఎస్పీ శ్రీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు.షీ టీం జూన్ నెలలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీలు, నిఘా చర్యల్లో 71 మందిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగిందని, నిబంధనలు ఉల్లంఘించిన 12 మందిపై ఈ-పెట్టీ కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు.అలాగే మహిళలు, బాలికల్లో చట్టాలపై అవగాహన పెంపొందించేందుకు జిల్లా వ్యాప్తంగా 42 అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని చెప్పారు. విద్యాసంస్థలు, ప్రజా ప్రదేశాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో మహిళల భద్రత, అత్యవసర సేవలు, షీ టీం సేవలు, సైబర్ నేరాల నివారణ వంటి అంశాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు.మహిళలు, బాలికలు ఎలాంటి వేధింపులకు గురైనా భయపడకుండా వెంటనే షీ టీం లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్పీ సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచడంతో పాటు, బాధితులకు తక్షణ సహాయం అందించి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.మహిళల భద్రత కోసం ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని, వేధింపుల సంఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని మెదక్ జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# మున్సిపల్ కౌన్సిల్‌లో వార్డు, పట్టణ సమస్యలపై..

- బీజేపీ కౌన్సిలర్ శంకర్ గౌడ్ గళం.
- అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని డిమాండ్

**రామాయంపేట, జూన్ 30 (సిరి న్యూస్)**




రామాయంపేట మున్సిపాలిటీ జనరల్ బాడీ సమావేశంలో 8వ వార్డు బీజేపీ కౌన్సిలర్ జాలిగామ శంకర్ గౌడ్ వార్డు అభివృద్ధి, పట్టణ సమస్యలు, ప్రభుత్వ హామీల అమలుపై పలు అంశాలను సభ దృష్టికి తీసుకొచ్చారు. మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వార్డులో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను తక్షణమే పూర్తి చేయాలని కోరారు. శిథిలావస్థకు చేరిన పాత భవనాలను తొలగించి ప్రమాదాలను నివారించాలని, మినీ వాటర్ ట్యాంక్‌పై సీసీ టాప్ ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే వార్డులో ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు చేయాలని కోరారు. పట్టణ ప్రధాన రహదారి విస్తరణ పనులు ఎందుకు జాప్యం అవుతున్నాయో ప్రజలకు స్పష్టత ఇవ్వాలని, మున్సిపాలిటీకి చెందిన 13 దుకాణాలను వెంటనే టెండర్‌కు పిలవాలని డిమాండ్ చేశారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధుల విషయంలో ఇరిగేషన్, టౌన్ ప్లానింగ్ అధికారులు సంయుక్తంగా నిర్ణీత హద్దులను ఖరారు చేసి, ఆ పరిధిలో ఉన్న స్థల యజమానులు, కొనుగోలుదారులకు మున్సిపాలిటీ స్పష్టమైన సమాచారం అందించాలని కోరారు. మున్సిపల్ నిధుల దుర్వినియోగంపై కూడా సమావేశంలో ప్రస్తావించిన శంకర్ గౌడ్, రూ.1.90 లక్షలు, రూ.30 లక్షల నిధుల వినియోగంపై వివరణ ఇవ్వాలని కోరారు. కాలగడ్డ శ్మశానవాటికలో లైట్లు, తాగునీరు, స్నానపు గదులు, అంత్యక్రియలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పట్టణంలో భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, సిద్దిపేట వైపు వెళ్లే రహదారిపై వర్షాలతో ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చి ప్రమాదాలను నివారించాలని అధికారులను కోరారు. దోమల నివారణ చర్యలను ముమ్మరం చేయాలని కూడా సూచించారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరిన ఆయన, ప్రజల ప్రయోజనం కోసం ఎక్స్‌ప్రెస్ బస్ స్టాప్ ఏర్పాటు చేయాలని, అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అద్య గ్రాండ్ హోటల్ నుంచి కామారెడ్డి రోడ్ ఎంట్రీ బైపాస్ వరకు రహదారి విస్తరణ, డివైడర్, వీధి దీపాల ఏర్పాటుతో పాటు మెహెర్ సాయి ఫంక్షన్ హాల్ నుంచి కామారెడ్డి రోడ్ ఎంట్రీ బైపాస్ వరకు లైటింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. మున్సిపల్ కౌన్సిల్ అవినీతికి తావులేకుండా ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేయాలని, పట్టణ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని శంకర్ గౌడ్ సమావేశంలో పేర్కొన్నారు.

# అక్కన్నపేటలో మద్యంపై సమరశంఖం.

- బెల్ట్ షాపులకు గ్రామసభలో చెక్..
- మద్యం విక్రయాలు, కొనుగోలుపై రూ.10 వేల జరిమానా
- అక్రమ విక్రయాలను పట్టిస్తే రూ.2 వేల నగదు బహుమతి.

**రామాయంపేట, జూన్ 30( సిరి న్యూస్)**

మెదక్ జిల్లాలోని రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామం మద్యనిషేధ దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామంలో విచ్చలవిడిగా సాగుతున్న బెల్ట్ షాపులు, అక్రమ మద్యం విక్రయాల వల్ల యువత భవిష్యత్తు నాశనమవుతోందని, కుటుంబాల్లో కలహాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసిన గ్రామస్థులు, మహిళలు గ్రామసభలో ఏకగ్రీవంగా మద్యనిషేధ తీర్మానాన్ని ఆమోదించారు. మంగళవారం గ్రామ సర్పంచ్ బక్కయ్య యాదగిరి, ఉపసర్పంచ్ ఎన్.ఎం. ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మద్యం మత్తులో యువకులు తమ జీవితాలను పాడు చేసుకోవడంతో పాటు, కుటుంబ ఆర్థిక పరిస్థితి దెబ్బతింటోందని, ఇంట్లోని విలువైన వస్తువులు, బంగారు ఆభరణాలను సైతం విక్రయించే పరిస్థితులు ఏర్పడుతున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం సేవించి ఇంటికి వచ్చి మహిళలను వేధించే ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గ్రామసభ తీర్మానం ప్రకారం గ్రామంలో ఎట్టి పరిస్థితుల్లోనూ బెల్ట్ షాపులు, అక్రమ మద్యం విక్రయాలు జరగరాదని నిర్ణయించారు. నిబంధనలు ఉల్లంఘించి మద్యం విక్రయించిన వారికి రూ.10 వేల జరిమానా, మద్యం కొనుగోలు చేసిన వారికి కూడా రూ.10 వేల జరిమానా విధించాలని నిర్ణయించారు. అలాగే అక్రమ మద్యం విక్రయాలను సమాచారం ఇచ్చి పట్టించిన వారికి రూ.2 వేల నగదు బహుమతి అందజేయనున్నట్లు ప్రకటించారు. ఈ తీర్మానాన్ని కట్టుదిట్టంగా అమలు చేసేందుకు గ్రామ పంచాయతీ పాలకవర్గం, మహిళా సంఘాలు సంయుక్తంగా పనిచేయనున్నాయని, గ్రామంలో అక్రమ మద్యం విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు సహకరించాలని కోరుతూ పోలీసు శాఖ, ఎక్సైజ్ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. అక్రమ మద్యం సేవించడం వల్ల కిడ్నీ, లివర్ సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని, యువత ఆరోగ్యాన్ని, కుటుంబాల భవిష్యత్తును కాపాడేందుకు గ్రామాన్ని మద్యం రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని గ్రామస్థులు ప్రతిజ్ఞ చేశారు. అక్కన్నపేట గ్రామం తీసుకున్న ఈ నిర్ణయం ఇతర గ్రామాలకు స్ఫూర్తిగా నిలుస్తోందని పలువురు అభిప్రాయపడ్డారు.



# సిగాచి మృతులకు పూర్తి నష్టపరిహారం చెల్లించాలి

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**సీఎం ప్రకటించిన రూ. కోటి పరిహారం ఇప్పటికీ అమలు కాలేదని విమర్శ**

**బీపీఎల్ చౌరస్తాలో మృతులకు ఘన నివాళి**




**పటాన్‌చెరు, జూన్ 30 (సిరి న్యూస్):**

సిగాచి పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదానికి ఏడాది పూర్తయినా మృతుల కుటుంబాలకు పూర్తి నష్టపరిహారం అందించడంలో పరిశ్రమ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం విఫలమయ్యాయని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విమర్శించారు. ప్రమాద స్థలంలో ముఖ్యమంత్రి ప్రకటించిన ఒక్కో మృతుడి కుటుంబానికి రూ. కోటి పరిహారం హామీ ఇప్పటికీ అమలు కాకపోవడం బాధాకరమని అన్నారు.సిగాచి దుర్ఘటనకు ఏడాది పూర్తైన సందర్భంగా ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని పాశమైలారం బీపీఎల్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డితో పాటు పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి ఆదర్శ్ రెడ్డి పాల్గొని మృతి చెందిన కార్మికుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత ఏడాది జూన్ 30న జరిగిన ప్రమాదంలో 54 మంది కార్మికులు మృతి చెందగా, ఎనిమిది మంది ఆచూకీ ఇప్పటికీ తెలియలేదని, మరో 40 మంది తీవ్ర గాయాలతో ఇప్పటికీ ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రమాదానికి పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని ఆరోపించిన ఆయన, ప్రభుత్వం కూడా బాధితులకు న్యాయం చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఘటన జరిగిన ఆరు నెలల తర్వాత ఒకరిని మాత్రమే అరెస్టు చేయడం ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని అన్నారు.మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రకటించిన పరిహారం వివరాలు వాస్తవాలకు విరుద్ధమని, బాధితులకు పూర్తిస్థాయిలో పరిహారం అందలేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఒత్తిడి వల్లే ప్రభుత్వం రూ.25 లక్షల పరిహారం ప్రకటించిందని, అయినప్పటికీ ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన రూ. కోటి పరిహారం ఇప్పటికీ అమలు కాలేదని ఆరోపించారు.మృతుల కుటుంబాలకు వెంటనే పూర్తి పరిహారం చెల్లించడంతో పాటు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, జీవితాంతం పెన్షన్ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ తరపున పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# తడి, పొడి చెత్త పై అవగాహన



**వెల్దుర్తి,జూన్ 30, సిరి న్యూస్**

ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం వెల్దుర్తి మండలంలోని కుక్కునూరు గ్రామపంచాయతీ ఆవరణలో తడి,పొడి చెత్త, సానిటరీ, హానికరం సేకరణపై పంచాయతీ సెక్రటరీ శ్రీధర్, సర్పంచ్ సాయిలు, ఉప సర్పంచ్ నవీన్,ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులకు, మహిళలకు,చెత్త సేకరణ బుట్టలను పట్టుకొని ఇళ్లలో ఉన్న తడి, పొడి చెత్తను, అలాగే ఇళ్లల్లో ఉన్న సానిటరీ, హానికరం చెత్తను, ఇళ్లలోనే వేరు చేసి పంచాయతీ ట్రాక్టర్లలో వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాయిలు, ఉప సర్పంచ్ నవీన్ , వార్డ్ మెంబర్ నేపాల్, సుధాకర్ గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

# దేవులపల్లి శివారులో ప్రభుత్వ భూమికి హద్దుల నిర్ధారణ..

**పసుపు రంగు సరిహద్దు రాళ్ల ఏర్పాటు..**



**హత్నూర , జూన్ 30,(సిరి న్యూస్)**

హత్నూర మండలంలోని దేవులపల్లి గ్రామ శివారులో ఉన్న సర్వే నంబర్లు 237, 241లోని ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు గుర్తించి, సంబంధిత భూమి హద్దులను అధికారికంగా నిర్ధారించారు. అనంతరం భూమి సరిహద్దులను స్పష్టంగా గుర్తించేందుకు పసుపు రంగు సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేశారు. తహసీల్దార్ ఫర్హీన్ షేక్, డిప్యూటీ తాసిల్దార్ సమక్షంలో దేవులపల్లి గ్రామ ప్రజలకు ప్రభుత్వ భూమి హద్దులను ప్రత్యక్షంగా చూపించారు. అనంతరం గ్రామ ప్రజల సమక్షంలో పంచనామా నిర్వహించి, భూమి హద్దులకు సంబంధించిన వివరాలను నమోదు చేశారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హరిబాబు, రాహుల్ నాయక్, జీపీఓలు ఈశ్వరమ్మ, సాయి తదితరులు పాల్గొన్నారు.ప్రభుత్వ భూములను పరిరక్షించడం, ఆక్రమణలకు అడ్డుకట్ట వేయడం, భూ వివాదాలను నివారించడం లక్ష్యంగా ఈ హద్దుల నిర్ధారణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

# అప్పట్లో పిల్లల్లా ఉండాలంటే.. స్వేచ్ఛగా బయట ఆడుకోనివ్వండి

ఆ రోజుల్లో పిల్లల ఆటలన్నీ ఆరుబయటే 2000 సంవత్సరం వరకు పిల్లల జీవనశైలి ఆరోగ్యకరంగా ఉండేది. రోజంతా మైదానాల్లో గడిపేవారు. నేటి తరం పిల్లలకు స్మార్ట్‌ఫోనే గ్రౌండ్‌గా మారిపోయింది. వీడియో గేమ్సే ఆటవిడుపుగా మారాయి. అయితే, ఆరుబయట ఆడుకునే పిల్లలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారని బ్రిటిష్ కొలంబియా విశ్వవిద్యాలయం పరిశోధన తేల్చింది.

నాటి తరానికి తెర అంటే.. టీవీ మాత్రమే సినిమా అంటే.. ఆదివారమే కానీ, ఇప్పటి పిల్లలు రోజంతా స్క్రీన్‌లోనే గడిపేస్తున్నారు. ఆటలేకాదు, పాఠాలు కూడా స్క్రీన్‌కు అంకితమై వింటున్నారు. స్మార్ట్‌ఫోన్, ట్యాబ్, కంప్యూటర్.. ఇలా స్క్రీన్ ఉచ్చులో చిక్కుకొని అనారోగ్య సమస్యలు తెచ్చుకుంటున్నారు. దేశంలో దాదాపు 61 శాతం మంది తల్లిదండ్రులు, తమ పిల్లల స్క్రీన్‌టైమ్ గురించి ఆందోళన చెందుతున్నారని పలు పరిశోధనల్లో తేలింది.



## పుస్తకాలే నేస్తాలు..

నైంటీస్ కిడ్స్ దాచుకున్న స్లామ్‌బుక్స్‌ను ఒక్కసారి తిరగేయండి. చాలా పేజీల్లో హాబీస్ దగ్గర.. 'రీడింగ్ బుక్స్' అనే కనిపిస్తుంది. పుస్తకాలే నేస్తాలుగా గడిచిన బాల్యం వాళ్లది. చందమామ కథలు చదువుతూ.. నిద్రలోకి జారుకున్న తరం వాళ్లది. మరిప్పుడో.. స్కూల్ బుక్స్, హోమ్ వర్క్ తప్ప, వేరే పుస్తకమే తెలియకుండా రోజులు గడిపేస్తున్నారు. కాబట్టి.. మీ పిల్లల్లో పుస్తక పఠనంపై ఆసక్తి పెంచండి. ప్రతిరోజూ పడుకునే ముందు.. వారికి ఒక మంచి పుస్తకం ఇచ్చి చదవమనండి. పుస్తకాలు చదవడం వల్ల వారిలో ఆలోచనా శక్తి పెరుగుతుంది. భాషా నైపుణ్యాలూ మెరుగుపడుతాయి. నాటికాలం పిల్లలు.. ప్రకృతి ప్రేమికులు. చుట్టూ ఉండే చెట్టూ చేమల్ని చూసే ఎక్కువగా నేర్చుకున్నారు. నేటితరానికి ఇల్లు, స్కూలూ తప్ప.. వేరే ప్రాంతం పెద్దగా తెలియదు. అయితే.. ప్రకృతితో మమేకమైతేనే.. పిల్లల్లో సృజనాత్మకత పెరుగుతుంది. సమస్య-పరిష్కార సామర్థ్యాలు మెరుగుపడతాయన్న విషయం తల్లిదండ్రులు గుర్తించాలి. అందుకే.. ప్రకృతిలో ఉన్న వింతలను, సహజత్వాన్ని పిల్లలకు అలవాటు చేయాలి. వైరస్‌లు, బ్యాక్టీరియాలు అంటూ భయపెట్టకుండా.. పిల్లల్ని స్వేచ్ఛగా మట్టిలో ఆడుకోనివ్వాలి. నీళ్లలో గెంతనివ్వాలి. ప్రకృతిని ప్రేమించేలా.. వారిని ప్రోత్సహించడం చాలా అవసరం.

### బంధాలతో అనుబంధం

90వ దశకంలో ఉమ్మడి కుటుంబాలే ఎక్కువగా ఉండేవి. ఏ పండుగొచ్చినా ఇళ్లన్నీ జనాలతో అనుబంధాల కలబోతలా కళకళలాడేవి. నలుగురు కలిసిఒక ఇంట్లో ఉండటమే గగనంగా ఉన్న ఈ రోజుల్లో.. ఇప్పటితరం కుటుంబంతో కన్నా సామాజిక మాధ్యమాల్లోనే ఎక్కువగా గడుపుతున్నది. ఫలితం.. మనిషికి ఉండాల్సిన సహజ భావోద్వేగాలు కూడా మృగ్యమైపోతున్నాయి. ఒక పూటైనా కుటుంబసభ్యులంతా కలిసి భోజనం చేసేలా ప్లాన్ చేసుకోండి. అన్నదమ్ముల పిల్లలను తరచూ కలుసుకునే పరిస్థితులు కల్పించండి. తద్వారా వారికి బంధాల విలువ తెలిసొస్తుంది.







# దేశంలో పాత గంగా నది ఏదో తెలుసా?

ప్రపంచంలోని ఏ దేశానికైనా నదులు చాలా ముఖ్యమైనవి. నదులు లేకుంటే తాగునీటికి, వ్యవసాయానికి ఎన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. సౌదీ అరేబియా, మాల్దీవ్స్, ఖతార్, కువైట్,యూఏఈ సహా 20 దేశాల్లో శాశ్వత సహజ నదులు లేక అక్కడి ప్రజలు ఒక్క లీటర్ వాటర్ కోసం భారీగా ఖర్చు చేయాల్సి వస్తుంది. తాగేందుకే నీళ్లు లేకుంటే ఇక వ్యవసాయమనే మాటే ఉండదు.




మనదేశం విషయానికొస్తే నదులకు కొరతే లేదు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు మనదేశంలో అనేక నదులు నిత్యం ప్రవహిస్తూ ఉంటాయి. మనదేశంలోని నదులు కేవలం తాగునీరు లేదా సాగునీటికి మాత్రమే పరిమితం కాదు ప్రజల విశ్వాసం కూడా వీటితో ముడిపడి ఉంది. భారతదేశంలో నదులకు తల్లి తో సమానంగా చూస్తుంటారు. అందుకే ఉదయం, సాయంత్రం నదీ ఘాట్లలో పండితులు హారతి కార్యక్రమం నిర్వహిస్తుండటం చూడవచ్చు



మనదేశంలో అత్యంత ప్రముఖమైన నది ఏదంటే ఎవరైనా ఖచ్చితంగా గంగానదే అని ఠక్కున సమాధానం చెప్పేస్తారు. మన దేశంలో ఓల్డ్ గంగా అని పిలువబడే ఓ నది ఉందని మీకు తెలుసా? ఏ నదిని ఓల్డ్ గంగా అని పిలుస్తారు? ఓల్డ్ గంగా నది ఎందుకంత స్పెషల్ అనే డీటెయిల్స్ ఇప్పుడు చూద్దాం. గంగా నది ప్రాముఖ్యత? భారతదేశ సంస్కృతి,సమాజం, ఆర్థిక అభివృద్ధిలో గంగా నదికి ముఖ్యమైన విలువ ఉంది. అత్యంత పవిత్రమైన నదిగా,తల్లి హోదాను పొంది మోక్షాన్ని ప్రసాదించే నదిగా గంగానది ప్రసిద్ధి చెందింది. ఈ నది భారతదేశ వ్యవసాయ, జలవిద్యుత్ ప్రాజెక్టులకు ప్రత్యేక సహకారం అందిస్తుంది. పర్యావరణ దృష్ట్యా ఈ నదిలో వివిధ రకాల వృక్షజాలం,జంతుజాలం కనిపిస్తాయి. అంతరించిపోతున్న డాల్ఫిన్లు భారతదేశంలోని బ్రహ్మపుత్ర, గంగా నదుల్లో మాత్రమే కనిపిస్తాయి. పర్యాటక పరంగా కూడా ఈ నది చాలా ముఖ్యమైనది. ప్రజలు పర్యాటకం కోసం దాని ఒడ్డున ఉన్న అనేక ప్రధాన నగరాలను సందర్శిస్తారు.గంగానది మొత్తం పొడవు 2525 కిలోమీటర్లు. ఉత్తరాఖండ్ లో పుట్టి ఉత్తరప్రదేశ్ లో వెయ్యి కిలోమీటర్లకు పైగా ప్రయాణించి బీహార్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్ మీదుగా ప్రయాణించి చివరకు బంగాళాఖాతంలో కలుస్తుంది. ఇది భారతదేశం,బంగ్లాదేశ్ సరిహద్దు నది కూడా.

గోదావరి నదిని పాత గంగ లేదా ఓల్డ్ గంగా అని పిలుస్తారు. పాత గంగ అని ఎందుకు పిలుస్తారు? గోదావరి నది భారతదేశంలో రెండవ అతిపెద్ద నది. ఈ నది మహారాష్ట్రలోని త్రిబంకేశ్వర్ నుండి ఉద్భవిస్తుంది. ఇక్కడి నుంచి బయలుదేరి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, చత్తీస్ గఢ్ లలో ప్రవహిస్తుంది. ఈ నది మొత్తం పొడవు 1465 కిలోమీటర్లు. కాబట్టి ఈ నదిని పాత గంగ అనే పేరుతో కూడా పిలుస్తారు.



The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.